
ఆంధ్రజ్యోతి



'సోమశిల'లో 43.776 టీఎంసీల నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరుగుతోంది. బుధవారం 23,088 క్యూసెక్కులు వస్తుండగా గురువారానికి 30,871 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాంలో 43.776 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,850, వరద కాలువకు 7,200, ఉత్తర కాలువకు 340 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● **రాపూరు :** కండలేరు డ్యాంలో 27.17 క్యూసెక్కుల నీరు ఉందని ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 6600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1935 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉందని తెలిపారు.



నెల్లూరు : పోలీస్ పరేడ్ మైదానంలో రూపుదిద్దుకున్న స్వాతంత్ర్య దినోత్సవ సభావేదిక



విద్యుద్దీప వెలుగుల్లో కలెక్టరేట్

స్వాతంత్ర్య వేడుకలకు

విస్తృత ఏర్పాట్లు

- ముస్తాబైన పోలీసు కవాతు మైదానం
- 332 మందికి ఉత్తమ సేవా అవార్డులు
- విద్యుద్దీప వెలుగుల్లో ప్రభుత్వ కార్యాలయాలు

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడకలకు జిల్లా ముస్తాబయ్యింది. జిల్లా కేంద్రమైన నెల్లూరులోని పోలీసు పెరేడ్ మైదానంలో ఈ వేడుకలు శుక్రవారం ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయి. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తారు. ప్రజలను ఉద్ధేశించి ప్రసంగిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖలు తమ పనితీరును చాటుతూ శకటా లను ప్రదర్శించనున్నాయి. అలాగే, విద్యార్థులు కూడా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఇందు కోసం జిల్లా యం త్రాంగం అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసింది. విశిష్ట సేవలు అందించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు 332 మందికి మంత్రి నారాయణ చేతుల మీదుగా పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందచేయనున్నారు. వీఐపీలు, అవార్డు గ్రహీతలు, విద్యార్థులు కూర్చోడానికి అన్నీ ఏర్పాటు చేశారు. స్వాతం త్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌తోపాటు అన్నీ ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. నగరపాలక సంస్థ అధికారులు మంచినీటి వసతి ఏర్పాట్లు చేసింది.



అమ్మకాన్ని మువ్వన్నెల జెండాలు



అబ్బో ఎంతబాగున్నాయో...

● **ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ**

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : పోలీస్ కవాతు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎస్పీ కృష్ణకాంత్ గురువారం పరిశీలించారు. కవాతు పరిశీలించి ఇంతే ఉత్సాహంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లోనూ చేయాలని సిబ్బందికి సూచించారు. భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ముఖ్య అతిథులకు గౌరవార్థం ఇచ్చే వందన సమర్పణ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అదనపు అదనపు ఎస్పీ సౌజన్య, ఎస్‌బీ, ఎఆర్ డీఎస్పీలు ఎ శ్రీనివాసరావు, ఎస్ చంద్రమోహన్, ఆర్‌ఐలు అంకమరావు, రాజారావు, హరిబాబు, పౌల్‌రాజు, శ్రీనివాసుల రెడ్డి, పాల్గొన్నారు.

'స్త్రీశక్తి'కి సర్వం సిద్ధం!



ఆర్టీసీ బస్సుకు రంగులు అద్దుతున్న కార్మికులు

- నేటి నుంచే మహిళలకు ఉచిత ప్రయాణం
- సీఎం ప్రారంభించిన తర్వాత అమలులోకి..
- సాయంత్రం నుంచి అందుబాటులోకి..
- గుర్తింపు కార్డు చూపితే జీరో టికెట్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులు ఇక మహిళల సొంత బస్సుల్లా మారనున్నాయి. 'స్త్రీశక్తి' పేరుతో బస్సుల్లో ఎంచక్కా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించనున్నారు. ఎన్నికల హామీల అమల్లో భాగంగా శుక్రవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఈ సౌకర్యం కల్పించనుంది.

● **సాయంత్రం తర్వాతే ఉచితం**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో సోమవారం సాయంత్రం ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఇక నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఓ ఆనంద్, నెల్లూరు జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిలు సాయంత్రం 5 గంటలకు మహిళల ఉచిత ప్రయాణానికి పచ్చజండా ఊపనున్నారు. ఆ తర్వాతే మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి రానుంది. మహిళల వద్ద గుర్తింపు కార్డును పరిశీలించి టిమ్ మిషన్ ద్వారా కండక్టర్లు జీరో టికెట్‌ను అందజేస్తారు. అంటే శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సుల్లో ప్రయాణించే మహిళలు టికెట్టు కొనాల్సిందే.

● **మరోసారి బస్సుల కండీషన్ పరిశీలిస్తూ**

'స్త్రీశక్తి' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రెండు నెలల నుంచి ఆర్టీసీ అధికారులతో ప్రభుత్వ పెద్దలు నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. మార్గమధ్యంలో బస్సులు ఆగకూడదని, మహిళలతో మర్యాదపూర్వకంగా మెలగాలని, బస్సులు కండీషన్‌లో ఉండేలా చూడాలని ఇలా పలు అంశాలపై రోజూ చర్చిస్తున్నారు. అధికారులు సైతం ఆయా డిపోల పరిధిలో సిబ్బందికి అవగాహన కల్పిస్తూ సమావేశాలు నిర్వహించారు.

మరుభూమి కోసం..

'మరణ' యాతన!

- మనిషికి దక్కని మరణానంతర గౌరవం
- శ్మశానాల్లో కానరాని కనీస సౌకర్యాలు



మనిషి జీవించి ఉన్నప్పుడే కాదు.. మరణంలోనూ గౌరవం ఇవ్వాలని మత విశ్వాసాలు నిర్దేశిస్తున్నాయి. ఒక్కో మతంలో ఒక్కో పేరుతో పిలుచుకున్నా.. అన్నింటి భావం మాత్రం ఒక్కటే. తెలుగులో అంతిమ సంస్కారాలు అంటారు. మనిషి జీవించినప్పుడు ఎలా హక్కులు కలిగి ఉంటాడో... మరణానంతరం మట్టిలోనో, మంటలోనో కలిసే వరకు అంతే హక్కులు కలిగి ఉంటాడు. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత రాజ్యాంగం కల్పించిన హక్కుల విషయంలో చాలా ప్రగతి కనిపించింది. సాంఘిక దురాచారాలు అంటరానితనం, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు దాదాపుగా లేవనే చెప్పాలి. అయితే 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో ఇంకా అక్కడక్కడ మరణానంతర గౌరవం మాత్రం దక్కడం లేదు. జిల్లాలో ఇంకా పాడె మోసుకొని వెళ్లడానికి దారిలేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. శవాన్ని పాతిపెట్టడానికి ఆరడుగుల జాగా దొరకని పల్లెలూ ఉన్నాయి. తెలుగుదేశంలో చంద్రబాబు శకం ఆరంభమైన తొలిరోజుల్లో జన్మభూమి పథకంతో ప్రజల్లో రగిలిన స్ఫూర్తి చాలా గ్రామాల్లో శ్మశాన వాటికలకు కొత్త రూపు ఇచ్చింది. ఆ దశలో ప్రభుత్వం స్పందించి శ్మశానాలకు భూమి, అక్కడకు వెళ్లేందుకు దారుల సౌకర్యం కల్పించింది. అప్పుడు మొదలైన ఈ ఉద్యమం ఆ తరువాతి ప్రభుత్వాలు కూడా కొనసాగించాయి. అయినా ఇంకా కొన్ని గ్రామాలు ఈ అదృష్టానికి నోచుకోలేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటుతున్నా.. అక్కడ మరణించిన వారికి దక్కాల్సిన చివరి హక్కులు దక్కడం లేదు. అలాంటి వాటికి ఉదాహరణలే ఈ గ్రామాలు...

స్థలాలు లేక అధ్వానంగా...

మనుబోలు : మండలంలోని చాలా పంచాయతీల్లో శ్మశానాలకు సరైన స్థలాలు లేవు. గత టీడీపీ ప్రభుత్వంలో (2014-19) కొన్ని పంచాయతీలకు శ్మశానాల బాగుకోసం నిధులు కేటాయించారు. అంటే ఒక్కో పంచాయతీకి రూ. పదేసి లక్షలు మంజూరు చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ శ్మశానాల బాగోగులపై దృష్టి పెట్టలేదు. కనీసం స్థలాలు కేటాయించలేదు. అయితే రెవెన్యూ రికార్డులలో మాత్రం భూములు ఇచ్చినట్లు నమోదు చేశారు. మండల కేంద్రమైన మనుబోలులోని కోదండరామపురంలో శ్మశానం సరిగాలేదు. దీంతో ఉన్న స్థలంలోనే శవాలు పూడ్చి, దానిపైనే కర్మక్రతువులు చేసే పరిస్థితి. ఇక జట్లకొండూరు పంచాయతీలో చెరువుకట్ట కింద ఆరడుగుల స్థలంలో దహన కార్యక్రమాలు చేస్తుంటారు. గురివిందపూడి, బద్దెవోలు, కొండూరు సత్రం గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి.



శవాలు పూడ్చాలంటే గగనమే..

వెంకటాచలం : సర్వేపల్లి పంచాయతీ పరిధిలోని యాదవ, కుమ్మరి, మంగలి, చాకలి తదితర బీసీ కులస్థులు, ఓసీలైన బలిజ కులస్థులు ఎవరైనా చనిపోతే వారిని కొత్తగుంట శ్మశాన వాటికలో ఖననం చేస్తారు. కానీ వర్షాకాలంలో మాత్రం శవాన్ని మోకాలిలోతు నీళ్లలో మోసుకుంటూ ఎక్కడ గట్టు కనిపిస్తే అక్కడ పూడ్చుకునే పరిస్థితి. అలాగే సర్వేపల్లి పంచాయతీ పరిధిలోని లింగంగుంట గిరిజనులకు శ్మశాన స్థలం లేక చెరువు కట్ట కిందే ఖననం చేసుకుంటున్నారు.



వాగు దాటితేనే..!

సీతారామపురం : మండల కేంద్రమైన సీతారామపురంలోని ముస్లింలు, హిందువులు అంతిమయాత్ర సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొట్లదిన్నె ప్రాంతంలో ఉన్న ముస్లింల శ్మశాన వాటికకు దారి లేకపోవడంతో మృతదేహాన్ని ఖననం చేయాలంటే వాగు దాటాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే పడమటి వీధిలోని హిందువుల శ్మశాన వాటిక వాగు సమీపంలో ఉంది. వర్షాకాలంలో వాగులోకి నీరొచ్చి సమాధులతో సహా కొట్టుకుపోతున్నాయి. ఈ సమస్యను పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాధులే కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడ.. ఎవరికి వేశారు ?

ప్రైవేటు స్కూళ్లు,కాలేజీల్లో అమలుకాని డీవార్మింగ్

- 8లో

మనకోసం.. మనమిత్ర

- అరచేతిలో 700 సేవలు అందుబాటులోకి
- నేటి నుంచి ప్రారంభం

సంగం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మొదటిసారిగా ప్రజల చేతిలోని సెల్‌ఫోన్ ఆధారంగా 700 పౌర సేవల వాట్సప్ గవర్నెన్స్ శుక్రవారం నుంచి అందుబాటులోకి రానుంది. మనకోసం మనమిత్ర పేరుతో 95523 00009 వాట్సప్ నెంబరు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. వాట్సప్‌లో ఈ నెంబరుకు హాయ్ అని మెసేజ్ పంపితే చాలు అవసరమైన సేవలు పొందవచ్చంటూ జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

● **సేవలు ఇలా..**

నేటి నుంచి సచివాలయాల పరిధిలో 28 శాఖలకు సంబంధించి700 సేవలు ప్రజలు అందుకోవచ్చు. ప్రతి సేవ సకాలంలో పొందవచ్చు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల చేతిలో ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్ నిర్వహిస్తుంది. జిల్లాలోని 37 మండలాల్లో సుమారు 650 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇవిగాక నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు మున్సిపాలిటీల్లో వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉంటున్న ప్రజలు మనమిత్ర, వాట్సప్ గవర్నెన్స్ ఉపయోగించి సేవలు పొందవచ్చు. దీని కోసం సచివాలయాల పరిధిలో వాట్సప్ గర్నెన్స్‌పె విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

● **ఉపయోగించడం ఇలా..**

ప్రభుత్వం వాట్సప్ నెంబరు 95523 00009ను మనమిత్ర పేరుతో సెల్‌ఫోన్‌లో సేవ్ చేసుకోవాలి. ఆ నెంబరుకు హాయ్ అని సందేశం పంపి చాట్ చేయాలి. వెంటనే మీకు వాట్సప్‌లో ఏఐ ఆధారిత చాట్ బాక్స్‌లో లభ్యమైన అన్ని ప్రభుత్వ సేవల జాబితా కనిపిస్తుంది. అందులో మీరు ఒకసేవను ఎంచుకోవాలి. వాయిస్ కమాండ్‌ను కూడా ఉపయోగించవచ్చు.

వర్షాలు రానున్నాయ్..

అప్రమత్తంగా ఉండండి!

- అధికారులకు జేసీ కార్తీక్ ఆదేశం
- 1077, 7995576699 నెంబర్లతో కంట్రోల్‌రూం

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ శంకరన్ హాలులో ప్రకృతి వైపరీత్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసిందని తెలిపారు. గతంలో ఏ ప్రాంతాలు ముంపునకు గురయ్యాయో ఆ ప్రాంతాలపై దృష్టి పెట్టాలన్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలకు వెంటనే మరమ్మతు చేయించాలని, గ్రామాలలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. 1077, 7995576699, 0861-2331261 నెంబర్లతో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని, వర్షాల కారణంగా ఇబ్బందులు తలెత్తినప్పుడు ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

● **ముఖ్యమంత్రి వీడియోకాన్ఫరెన్స్**



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీటి వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి సీఎం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు, ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో కాలువల్లో పూడికతీత పనులు, చెక్‌డ్యామ్‌లు, చెరువుల మరమ్మతు పనులు తదితరాలను చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



ముందస్తు సంబరం

శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణలో చిన్నారులు మురిపించారు. శనివారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని గురువారం జిల్లావ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో ముందస్తు సంబరాలు జరిగాయి. తలపై కిరీటం, చేతిలో పిల్లనగ్రోవి, మెడలో హారాలు, పంచెకట్టుతో బాలలు ఆకట్టుకున్నారు. అదేస్థాయిలో బాలికలు కూడా గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు.

శ్రీకాంత్‌రెడ్డికి ముగిసిన పోలీస్ కస్టడీ

నెల్లూరు (క్రైం): రుస్తుం మైన్స్ కేసులో నిందితుడిగా ఉన్న బిరద వోలు శ్రీకాంత్‌రెడ్డి పోలీసుల కస్టడీ గురువారం ముగిసింది. కోర్టు అనుమతులతో నెల్లూరు సెంట్రల్ జైల్‌లో రిమాండ్‌లో ఉన్న శ్రీకాంత్‌రెడ్డిని మంగళవారం పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మూడు రోజులపాటు సుమారు 60 ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. రియల్‌ఎస్టేట్‌కు సంబంధించిన పెట్టుబడులపైనే పోలీసులు ఎక్కువ ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. మూడు రోజుల విచారణలో పలువురి పేర్లు శ్రీకాంత్‌రెడ్డి పోలీసులకు తెలిపినట్లు సమాచారం. వీరిలో కొందరు జైన్‌లు ఉన్నట్టు తెలిసింది. శ్రీకాంత్ రెడ్డి ఇచ్చిన సమాచారంతో మరి కొందరిని ఈ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తారా!? లేదా నోటీసులు అందిస్తారా!? అరెస్టులు చేస్తారా వేచి చూడాల్సిందే.

'అన్నదాత సుఖీభవ'కు మరో అవకాశం

నెల్లూరు (వ్యవసాయం): అన్నదాత సుఖీభవ పథకం మొదటి విడతలో లబ్ధి పొందని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉండి లబ్ధి పొందని రైతులు ఈ నెల 20వ తేదీలోగా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు. అక్కడ అర్హతను నిర్ధారించే పత్రాలు, గుర్తింపు కార్డు, భూమికి సంబంధించిన పత్రాలు, ఆధార్, బ్యాంకు ఖాతా తదితర పత్రాలను అందజేయాలని తెలిపారు. అదేవిధంగా ఎన్‌పీసీఐ లింకు కానివి, మ్యాప్ కానివి బ్యాంకుల్లో సరిచేసుకోవాలని సూచించారు. రైతులు వారికి సంబంధించిన ఆధార్‌కు భూమి లింక్ కానివారు, మరొకరి ఆధార్ లింక్ అయిన వారు, చనిపోయిన రైతుల వారసులు వారి పొలం మ్యుటేషన్‌కు రెవెన్యూ అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని తెలిపారు. సమగ్ర పరిశీలన తరువాత మొదటి విడత అన్నదాత సుఖీభవ ఆర్థికసాయం రూ.5వేలు త్వరలోనే వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక

వెంకటాచలం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలో శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పర్యటించనున్నారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు వెంకటాచలం జడ్పీ హైస్కూల్‌లో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొంటారన్నారు. 8.30 గంటలకు చవటపాళెం సొసైటీ కార్యా లయ ఆవరణం, 8.45కు వెంకటాచలం సామాజిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరిస్తారన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9576
వెండి కిలో ధర	రూ. 118300
వెండి ఒక గ్రాము	రూ. 121.30

పులివెందుల జడ్పీటీసీ గెలుపుపై సంబరాలు

విడవలూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందటంతో ఎంపీటీసీ చలంచర్ల కామేశ్వరమ్మ, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవేలు సత్యంరెడ్డి, నాయకులు తిక్కవరపు అశోక్ కుమార్ గురువారం సంబరాలు జరుపుకొన్నారు.

నేడు 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రారంభం

పొదలకూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం స్థానిక పంచాయతీ బస్టాండ్ ఆవరణలో 'స్త్రీ శక్తి' ఉచిత బస్సును ప్రారంభిస్తారని టీడీపీ మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు తెలిపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

వ్యవసాయం యాంత్రీకరణలో సర్వేపల్లిదే అగ్రస్థానం

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి


రైతుకు డ్రోన్ అందిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీలో సర్వేపల్లి నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మం డలపరిషత్ కార్యాలయంలో గురువారం డ్రోన్ దీదీ కార్యక్రమంలో భాగంగా కొమ్మలపూడికి చెందిన చంద్రమోహన్ అనే రైతు కు రూ. 9.85 లక్షలు విలువచేసే డ్రోన్‌ను 80 శాతం సబ్సిడీ తో ఎమ్మెల్యే చేతులమీదు గా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వేపల్లిలో ఇప్పటివరకు వ్య వసాయ యాంత్రీకరణ కింద 138 స్ప్రే యర్లు, 87 ట్రాక్టర్ పరికరాలు, 40 రోటోవీటర్స్, 15 బ్రష్‌కటర్స్,7 పవర్‌వీడర్స్, 11 డ్రోన్లను రైతులకు అందించామన్నారు. నియోజకవర్గంలో 28 వేల మంది రైతులకు 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రూ. 18 కోట్లకు పైనే ఇచ్చామన్నారు. అనంతరం సోమి రెడ్డి ట్రస్టు ద్వారా కొమ్మలపూడిలో పాము కాటుకు గురై చనిపోయిన మహిళ కుటుంబానికి రూ. లక్ష చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కుడిచెరువులో చేపలు పట్టుకునేందుకు సహక రించిన ఎమ్మెల్యేకి మనుబోలు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, నాయ కులు మదునాయుడు, పచ్చిపాల రామిరెడ్డి, మన్నెమాల భాస్కర్‌రెడ్డి, సాని వెంకట రమణయ్య, రాయపాటి కిరణ్, దండు చంద్ర శేఖర్ రెడ్డి, ఏడీ ఏ శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి పెద్దపీట

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నార్తురాజు పాలెంలో హైస్కూల్ నుంచి ధాన్యం గోడౌన్ వరకు నిర్వహించిన విజయోత్సవ ట్రాక్టర్ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పెరిగిన ధరలతో రైతులు వ్యవసాయం మానుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వారి సంక్షేమం లక్ష్యంగా అన్నదాత సుఖీభవ ద్వారా ఆదుకుని ఆపద్బాంధవుడయ్యారని అన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లు, జి.శేఖర్‌రెడ్డి, టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, టీడీపీ నాయకులు జొన్న శివకుమార్, చెక్క మదన్, కె వెంకటరమణరెడ్డి, గరికపాటి రాజేంద్రకుమార్, వంశీ, హరిరెడ్డి, వినీల్‌రెడ్డి, ప్రవీణ్, నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు పాల్గొ న్నారు.

గ్రామీణ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

కోవూరు: గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టెక్నాలజీ, పరి శ్రమలు, సేవారంగాల్లో యువతకు ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉపాధి కల్పిస్తోందన్నారు. ఐటీ, ఫార్మా, మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు ఉద్యోగా లకు ఎంపికైన 110 మంది స్థానిక యువ కులకు నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా అధికారి అబ్దుల్ ఖయ్యూమ్, తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాల రెడ్డి, టీడీపీ నాయకులు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణం వందే జగద్గురుమ్!

● అమరావతి పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణ, గోపికల వేషధారణలతో అలరిస్తున్న చిన్నారులు

పొదలకూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అమరావతి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో గురువారం ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో పాఠశాల ఆవరణను సాంస్కృతిక వాతావరణంతో నింపారు. చిన్నారుల మకరంద క్రీడలు, కృష్ణలీల నృత్యాలు, గీతాలు, విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ కె సురేష్ విద్యార్థులకు శ్రీకృష్ణుని జీవితం, బోధనలు, సత్యం, ధర్మం పట్ల ఆయన అచంచల నిబద్ధ గురించి వివరించారు. ఈ వేడుకల ద్వారా విద్యార్థుల్లో సంస్కృతి, సాంప్రదాయ విలువలు, భక్తి, స్నేహం, సత్య నిష్ఠ వంటి సద్గుణాలను పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ వేడుకలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం) ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బైక్ చోరీపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు, తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం సదాశివపురానికి చెందిన పీ. మునిశంకర్ ఈ నెల9న నెల్లూరుకి వచ్చారు. పొదలకూరురోడ్డు హెచ్ ఆర్ కల్యాణమండపం సమీపంలోని హోటల్ వద్ద తన బైక్‌ను పార్క్ చేశారు. హోటల్‌లో టిఫిన్‌చేసి బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు వేదాయపాలెం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● **ఇంట్లో చోరీపై...**

ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, రాజీవ్‌గృహకల్ప సముదాయంలో నారాయణమ్మ కుటుంబం నివాసం ఉంటోంది. ఈ నెల 13న కుటుంబంతో కలిసి ఆమె బంధువుల వివాహానికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని సుమారు 28 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి కాళ్ల పట్టీలు, రూ.3వేల నగదు దోచుకెళ్లారు. గురువారం ఇంటికి వచ్చిన బాధితురాలు చోరీ ఘటనపై చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కొడవలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గండవరం గ్రామంలోని గాడికాయలు కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గోళ్ల ప్రసాద్‌కు చెందిన ఇల్లు గురువారం దగ్ధమైంది. సమాచారం అందిన వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ పరంగా పక్కా ఇంటి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట దేవస్థానం ఛైర్మన్ ఆలం మాలకొండయ్య, ఇరిగేషన్ ప్రెసిడెంట్ కంచి ఈశ్వర్ రెడ్డి, తెలుగేదేశం పార్టీ నాయకులు బచ్చు సురేష్, జగన్మోహన్‌రెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

బుచ్చి డీఎల్ఎన్ఆర్ హైస్కూల్‌లో నేడు జెండా పండుగ

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 14, (ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య వేడుకలకు బుచ్చి పట్టణంలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూలు ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథిగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. మండల, నగర పంచాయతీలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 2 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు వేడుకల్లో పాల్గొంటారని పీఈటీలు, తిరుపతయ్య, టీవీ రమణయ్య తెలిపారు. గురువారం హైస్కూలు ప్రాంగణంలో ఎన్‌సీసీ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అర్బన్, రూరల్ టీడీపీ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, జగదీష్, కేవీ శేషయ్య, మోర్ల మురళి, ఎంపీడీఓ నారాయణరెడ్డి, కమిషనర్ బాలకృష్ణ, ఎంఈఓలు దిలీప్ కు మార్, వెంకటరత్నం, నాయకులు కమలాకర్ రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ. సంతోష్ రెడ్డి, సిబ్బందితో జెండా వందనం ట్రయల్స్ నిర్వహణను పరిశీలించారు.

పశువుల సంత వేలం రూ. 30లక్షలు

మనుబోలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలో పశువుల సంత, కుడిచెరువులో చేపల వేలంపాటను గురువారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా పశువుల సంత వేలంపాట నిర్వహించగా రూ. 5 వేలు ధరావత్తు చెల్లించి 8మంది వేలంపాట పాడేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర ప్రకారం రూ. 13.60 లక్షల నుంచి వేలంపాటను ప్రారంభించారు. వేలంపాటదారులు పోటీ పడడంతో గతేడాది కంటే ఈసారి రెండు రెట్లు అధికంగా వేలం పాట పలికింది. చివరికి రూ. 30 లక్షలకు కంటిపల్లి సుధాకర్ దక్కించుకున్నారు. అనంతరం ఆయనకు హక్కుపత్రాలను డిప్యూటీ ఎంపీడీవో నారాయణ అందజేశారు. కుడిచెరువులో చేపల వేలంపాట ప్రారంభించాల్సి ఉండగా మనుబోలు గిరిజనులు తమకు కుడిచెరువు ఇవ్వాలని కోరారు. ఇందుకు పంచాయతీ, ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో వేలంపాట లేకుండానే రూ. 78 వేల ఫీజు పంచాయతీకి కట్టించుకుని గిరిజనులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంచి పద్మమ్మ, కార్యదర్శులు గరుడయ్య, శ్రావణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సోమిరెడ్డికి రుణపడి ఉంటాం

మనుబోలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి జీవింతాంతం రుణపడి ఉంటామని నూతన మనుబోలు పీఏసీఎస్ ఛైర్మన్ పొన్నూరు రామకృష్ణయ్య అన్నారు. మనుబోలు పీఏసీఎస్ ఛైర్మన్‌గా పొన్నూరు, డైరెక్టర్లుగా సాని వెంకట రమణయ్య, ఉడతా విజయ్‌కుమార్‌లను నియమించారు. వీరు గురు వారం నెల్లూరు కార్యాలయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డిని వారు ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు మన్నెమాల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొడ్ల కోదండరామిరెడ్డి దంపతులకు సత్కారం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగసు ్టు14 (ఆంధ్రజ్యోతి): వవ్వేరు కోఆపరేటివ్ రూరల్ బ్యాంకు త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా బుచ్చి మాజీ ఎంపీపీ దొడ్ల విజయలక్ష్మి నియామకంపై స్థానిక గోపాలకృష్ణయ్య పాఠశాల కరస్పాండెంట్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం వవ్వేరు బ్యాంకు ఛైర్మన్ దొడ్ల విజయలక్ష్మి, కోదండరామిరెడ్డి దంపతులను సత్కరించి, గణపతి చిత్రపటాన్ని బహూకరించారు. అందరి సహకారంతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని విజయలక్ష్మి పేర్కొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా అభియాన్

ఇందుకూరుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు జడ్పీ హైస్కూల్ నుండి మిట్ట వరకు మండల బీజేపీ అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా యాత్ర ఘనంగా జరిగింది. అవినాష్ రెడ్డి, మహేష్, రాంబాబు, రమణ పాల్గొన్నారు.

వరి విత్తనాభివృద్ధి చేసి అమ్మితే అధిక లబ్ధి


మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ అనిత

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరి విత్తనాభివృద్ధి చేసి ఆ ధాన్యాన్ని విత్తనాల కింద అమ్మితే అధిక లబ్ధి పొందవచ్చని ఏపీ సీడ్స్ మేనేజరు పి. సుబ్రహ్మణ్యం రైతులకు సూచించారు. గురువారం బుచ్చి రెడ్డిపాళెంలోని వవ్వేరు బ్యాంకులో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఏటీఎంఏ) ఆధ్వర్యంలో రైతులకు వరి విత్తనాభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, కోవూరు వ్యవసాయ సహాయ సంచాలకులు జి. అనిత హాజరయ్యారు. మద్దతు ధరకన్నా 30 శాతం అధిక ధరతో నెల్లూరు ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తామన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకానికి అర్హులైన లబ్ధిదారులు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని కోవూరు వ్యవసాయ సహాయ సంచాలకులు జి. అనిత తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి. ఎస్ శ్రీహరి, వ్యవసాయ విస్తరణాధికారి ఎస్ ఇందు, రైతులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 520

పులివెందులలో టీడీపీ గెలుపు.. ప్రజావిజయం

నెల్లూరు (వైద్యం)/సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీకి చారిత్రాత్మక విజయం నమోదయిందని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జడ్పీటీసీగా ఎన్నికయిన మారెడ్డి లతారెడ్డికి శుభాకాంక్షలు తెలియచేశారు. కాగా పులివెందులలో గత 30 ఏళ్ల తరువాత అక్కడ ఓటర్లు స్వేచ్ఛగా తమ హక్కును వినియోగించుకున్నారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. అక్కడ వైసీపీ అభ్యర్థికి డిపాజిట్లు కూడా రాకపోవడాన్ని జగన్ గుర్తించి తన అహంకారాన్ని తగ్గించుకోవాలని నారాయణ పేర్కొన్నారు.

ట్రాఫిక్ దారి మళ్లింపు

నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి): రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద సీసీరోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటం తో శుక్రవారం నుంచి ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తున్నామని ఎస్పీ కృష్ణకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మ వైపు నుంచి వచ్చే వాహనాలు వీఆర్సీ సెంటర్, ఏసీ మార్కెట్ మీదుగా మళ్లించామన్నారు. ఆత్మకూరు బస్టాండు, ముత్తుకూరు వైపు నుంచి వచ్చే వాహనాలను మినీబైపాస్ రోడ్డు మీదుగా దారి మళ్లించామన్నారు.

కృష్ణాష్టమి సంబరాలు : నెల్లూరు(విద్య),(ఆంధ్రజ్యోతి) : నగరంలోని సరస్వతీనగర్‌లో ఉన్న డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాల, నవాబుపేటలోని రవీంద్రభారతి పాఠశాలలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషాలతో అలరించారు.

నగరంలో విద్యార్థుల తిరంగా ర్యాలీ



వంద మీటర్ల జెండాతో విద్యార్థుల ర్యాలీ



నగరంలో నర్సింగ్ విద్యార్థుల తిరంగా ప్రదర్శన

నెల్లూరు(విద్య), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆర్ఎస్ఆర్ మున్సిపల్ పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు జాతీయ జెండాతో ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ప్రతి ఇంటిమీద జాతీయ జెండా ఎగరాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మధుసూదన్‌బాబు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ ఆఫీసర్స్ బాలబ్రహ్మాచారి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు. నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో 100 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థులు చేపట్టిన ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది. అలాగే వాత్సల్య శరణాలయం, భారతీయ విద్యా వికాష్ స్కూల్, జీవీఆర్ఆర్ కళాశాల విద్యార్థులు మినీ బైపాస్‌రోడ్డులో తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారీ జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి టీవీఎస్ దుర్గాప్రసాద్‌రావు, జీవీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబీ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డీ. వెంకటేశ్వర్లు, హెచ్ఎం మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

● **నెల్లూరు (సాంస్కృతికం)** : నగరంలో డాక్టర్ ఎ స్వీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు దేశభక్తి గీతాల ఆలపిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ మునికుమార్, ఇన్‌చార్జి కే.తిరుపతమ్మ పర్యవేక్షించారు.

● **నెల్లూరు (వైద్యం)** : నగరంలోని వేదాయపాళెం లో ఉన్న సుస్మిత నర్సింగ్ కళాశాల నుంచి చైతన్యపురి వరకు గురువారం తిరంగా ప్రదర్శన జరిగింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బద్దెపూడి సురేంద్ర, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, పీఎంపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ. శేషయ్య, సుస్మిత నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పాపమూరు మల్లికార్జున పాల్గొన్నారు.

చిన్నారులకు ఆహ్లాదాన్నిచ్చే పికాబు ప్లేజోన్



పికాబు ప్లేజోన్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చిన్నారులు ఆహ్లాదంగా ఆడుకోడానికి సెంట్రల్ ఎయిర్ కండీషన్‌తో పికాబు ప్లేజోన్ ఏర్పాటు చేశామని నిర్వాహకుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పదేళ్లలోపు పిల్లల కోసం ఆధునిక క్రీడాసామగ్రి ఏర్పాటు చేశామని చెప్పారు. పిల్లలకు అత్యంత ఇష్టమైన దాగుడు మూతలు, జారుడు బల్లలు, ఇసుకలో ఆటలు, ట్రంపోలిన్, నిటారుగా తాడు సహాయంతో ఎక్కే గోడలు వంటి వసతులు ఉన్నాయని ఆయన వివరించారు. పిల్లలు అద్భుత ఆటతీరును కనబరుస్తూ, వారి సృజనాత్మకతను పెంపొందించుకునే అవకాశం ఈ ప్లేజోన్‌లో ఉందని తెలిపారు. పిల్లలపుట్టిన రోజు వేడుకలు ఇక్కడ చేసుకొనే సౌకర్యం కూడా ఉందన్నారు. ఎంతో ఆకర్షణగా పికాబు జోన్‌ను తీర్చిదిద్దామని ఆయన చెప్పారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

● **రామలింగాపురం అండర్ బ్రిడ్జి మూత**

నెల్లూరు(సిటీ), ఆగస్టు, 14,(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద రాకపోకలను నిలిపివేశారు. వంతెన కింద రూ. 59 లక్షలతో సీసీరోడ్డును నిర్మించేందుకు గురువారం శంకుస్థాపన చేశారు. ఎన్ఎంసీ కమిషనర్ నందన్, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వంతెన కింద తరుచూ రోడ్డు పాడవుతుండటంతో శాశ్వత నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. సెప్టెంబరు నెలాఖరు వరకు రోడ్డు పనులు జరుగుతాయని, ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జ్యోతిప్రియ, మాజీ మేయర్ భానుశ్రీ పాల్గొన్నారు. కాగా ఆచారివీధి, కలెక్టరేట్ ప్రాంతాల్లో రోడ్డు ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ నందన్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డును ఆక్రమించి వ్యాపారం సాగిస్తున్న ఎంఎస్ పండ్ల దుకాణదారుడికి రూ. 10 వేలు జరిమానా విధించారు. అనంతరం ఇంజనీరింగ్ విభాగంపై వారంతపు సమీక్ష నిర్వహించారు.

ఓటు హక్కుకు విఘాతం : సీపీఎం

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుకు విఘాతం ఏర్పడుతుందని మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సీపీఎం రూరల్ కార్యదర్శి కొండాప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను నిరసిస్తూ గురువారం నగరంలోని ఆర్టీసీ వద్ద నిరసన సీపీఎం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతతత్వ అజెండాను వేగవంతంగా అమలు చేసేందుకు ఈ ఎస్ఐఆర్‌ను వినియోగించుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పెంచలనర్సయ్య, సతీష్, నాగేశ్వరరెడ్డి, సుధాకర్, సంపత్‌కుమార్, షాహినాబేగం, రఫీ, మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి

నెల్లూరురూరల్, ఆగస్టు, 14,(ఆంధ్రజ్యోతి) :రోడ్డు ప్రమాదానికి గురైన ఓ ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారని రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. సీఐ కథనం మేరకు, అనంతపురం జిల్లాకు చెందిన తలారి ధనుంజయ (43) నెల్లూరు రూరల్లోని కల్లూరిపల్లిలో రెండేళ్లగా కుటుంబంతో జీవిస్తున్నాడు. ఆటోలో పండ్లు అమ్ముకుంటూ బతుకుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 9న పండ్లుకొనుగోలుకు మార్కెట్‌కు బయల్దేరాడు. కొద్దిదూరం వెళ్లగానే కుక్క అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడ్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృత్యువాడపడినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు శ్రావణ శుక్రవారం వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఉదయం లక్ష కుంకుమార్చన, సాయంత్రం పూలంగిసేవ, పల్లకీసేవ నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

● ఇరుగాళమ్మ ఆలయంలో ఉదయం 6గంటలకు మూలవర్లుకు అభిషేకాలు, 8గంటలకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా వందనం ఉంటుందని ఈవో వీ.గిరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 9గంటలకు వాసన్ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తామని, సాయంత్రం 4గంటలకు గణపతి, శ్రీరుద్ర, మహాలక్ష్మీ హోమాలు, ఉత్సవమూర్తులకు తిరుమంజనం సేవ, రాత్రి పుష్పయాగం నిర్వహిస్తామన్నారు.

● కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం సామూహిక కుంకుమ పూజ, సాయంత్రం పూలంగిసేవ, రాత్రి పసుపు కుంకుమల పంపిణీ ఉంటుందని ఆలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు పేగు షణ్ముఖరావు తెలిపారు.

నేడు వరలక్ష్మీ వ్రతం : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు వరలక్ష్మీ వ్రతం నిర్వహించన్నుట్లు ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలాగే ఈనెల 22న ఉదయం 10గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన జరుగుతుందన్నారు. స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.5,116 విరాళం ఇచ్చిన దాతలకు వారు కోరుకున్న రోజున అన్నదానం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

డాక్టర్ పోకల రవికి రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం



నెల్లూరు (వైద్యం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డెల్టా ఆసుపత్రి అధినేత, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ పోకల రవికి రాజ్‌భవన్ నుంచి గురువారం పిలుపు వచ్చింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆగస్టు 15న సాయంత్రం ఇచ్చే తేనీటి విందులో పాల్గొనాలని ఆయనకు ఆహ్వానం అందింది. కరోనా సమయంలో ఆయన రోగులకు అనేక విధాలా వైద్య సేవలు అందించారు. అలాగే పలు ప్రజాహిత కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. విజయవాడ వరదల్లో చిక్కుకున్న బాధితులను డాక్టర్ రవి ఆదుకున్నారు. దీంతోపాటు జిల్లాలో వైద్య శిబిరాలు నిర్వహించి పలువురు చిన్నారులకు ఉచిత వైద్యం అందించారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని ఆయన్ను ఎంపిక చేశారు. ఆయనతో పాటు జిల్లాకు చెందిన యోగా ట్రైనర్ డాక్టర్ స్వప్నకు కూడా రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం అందింది.

శ్రీవారి సేవలో వీపీఆర్ దంపతులు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు గురువారం దర్శించుకున్నారు.

పెళ్లకూరుకి సోమిరెడ్డి అభినందన

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీ కనీస వేతన బోర్డు చైర్మన్‌గా నియమితులైన టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులరెడ్డిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శాలువా, పుష్పమాలతో అభినందించారు. గురువారం పెళ్లకూరు నివాసానికి వెళ్లిన సోమిరెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలియచేశారు. అలాగే టీడీపీ రాష్ట్రకార్యదర్శి జెన్ని రమణయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు పెళ్లకూరు నివాసానికి చేరుకుని గజమాలతో సత్కరించారు.

జాషువా గ్రంథాలయానికి విరాళాలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని గుర్రం జాషువా గ్రంథాలయ నిర్మాణానికి నగర కమిషనర్ ఓవై నందన్ రూ.25వేల విరాళాన్ని అందచేశారు. ఈ విరాళాన్ని గ్రంథాలయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ కాశీంకు గురువారం ఫోన్‌పే ద్వారా పంపారు. అలాగే విశ్రాంత ఇంజనీరు పరంధామయ్య కూడా రూ.10వేలు అందచేశారు. అతి త్వరలో గ్రంథాలయ నిర్మాణ పనులను చేపడతామని కాశీం తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ప్రజాసత్తా జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు తెలిపారు. గురువారం జిల్లా ప్రజారవాణా ధికారి కార్యాలయంలో ప్రజారవాణాధికారి షేక్ షమీమ్‌ను ప్రజాసత్తా నాయకులు కలిసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేస్తూ లేఖ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహిళలతో పాటు ట్రాన్స్ జెండర్స్‌కు ప్రయాణ అనుమతులు ఇచ్చినందున భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాసత్తా రాష్ట్ర నాయకులు పుల్లకూర శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లను తిరగనివ్వబోమని బెదిరింపులు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : తమతో కలిసి వ్యాపారం చేయకుండా ట్యాంకర్లు తిరగనివ్వబోమని సన్నపరెడ్డి పెంచలరెడ్డి, ఆయన అనుచరులు బెదిరిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని కాళహస్తికి చెందిన ఓంశ్రీధర్ ట్రేడర్స్ యజమాని యోగానంద్ తెలిపారు. గురువారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణాపట్నం పోర్టు నుంచి రోజూ 250 నుంచి 350 ట్యాంకర్లు రిఫైనరీలకు వెళ్లేవని తెలిపారు. అయితే ట్యాంకర్ల యజమానులను పెంచలరెడ్డి, ఆయన అనుచరులు తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఆయన బెదిరింపులకు భయపడి కంపెనీకి ఐదు ట్యాంకర్లను మాత్రమే లోడింగ్ చేసుకుంటున్నామని తెలిపారు. ఎడిబుల్ ఆయిల్స్ యూనియన్ నాయకుడని ఆయన బెదిరింపులు, వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు.

సరిలేరు.. సరితకెవ్వరు!



ఆ యువతిది చిన్న పల్లెటూరు. పాడిపంటలే ఆమె తల్లిదండ్రులకు జీవనా ధారం. అలాంటి కుటుంబానికి చెందిన సరిత చిన్ననాటి నుంచి తల్లిదండ్రులకు పొలం పనుల్లో చేదోడుగా ఉండటమే కాదు. చదువు లోనూ రాణించేది. క్రీడల్లో మేటిగా నిలిచి బంగారు పతకాలు సాధించి నేటి యువతకు రోల్ మోడల్‌గా నిలిచింది.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)

కరాటేలో బంగారు పతకాలు

రైతు ఇంట మెరిసిన క్రీడాకుసుమం

కలిగిరి మండలం వీరనకొల్లు పంచాయతీలోని చిన్న కుగ్రామమైన బసిరెడ్డిపాలెంలో బోరెడ్డి సుబ్బారెడ్డి, రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె సంధ్య, సాఫ్ట్‌వేర్ చదువుతో ఉద్యోగం సంపాదించి వివాహం చేసుకొని అత్తారింటికి వెళ్లింది. రెండవ కుమార్తె సరిత. ఆ దంపతులు తమకు కుమారులు లేకపోయినా చిన్న కుమార్తె సరితలో కొడుకును చూసి మచ్చటపడేవారు. దీనికితోడు అమ్మమ్మ సంతతిలో ఎక్కువమంది పోలీస్ విభాగం లో ఉండటంతో సరిత కూడా వారిలా పోలీస్ కావాలని, ఫైటింగ్ చేయాలని చిన్నతనం నుంచే బలమైన కోరిక ఉండేది. 1 నుంచి 5వతరగతి వరకు స్వగ్రామంలోనే సాగింది. అనంతరం ఏపీ మోడల్‌లో స్కూల్లో 6వ తరగతిలో చేరిన తరువాత సరిత రోల్ పూర్తిగా మారిపోయింది. 8వ తరగతి చదివే సమయంలో స్థానికంగా ఉన్న



సినీనటుడు సుమన్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న సరిత

కరాటే మాస్టర్ సుమన్ శ్రీనివాస్ కలిగిరిలో కరాటే డెమో క్లాసులు ఇవ్వడంతో తానూ కరాటే క్లాసులకు వెళతానని తల్లిని కోరగా సరితలోని పట్టుదల గమనించి ప్రోత్సహించింది. దీంతో నాటి నుండి కఠోర దీక్షతో కరాటే నేర్చుకోవడంతోపాటు స్థానికంగా, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించే స్థాయికి చేరుకుంది.

ప్రతిభ PRATIBHA

● మొదటిసారి..

హైస్కూల్‌స్థాయిలో మొదటిసారి కావలి సమీపంలోని తుమ్మలపెంట వద్ద జరిగిన కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఇంటర్ మొదటి సంవత్సరం చదివే సమయంలో బ్లాక్‌బెల్ట్ సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివేటపుడు గోవాలో జరిగిన నేషనల్‌స్థాయి పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించింది. 2015, 2016లో వింజమూరు హైస్కూల్‌లో జరిగిన పోటీల్లో సరిత ప్రతిభను గుర్తించిన ఓ వ్యక్తి ఆమె కోరిక మేరకు ఏపీ మోడల్ స్కూల్‌లో మొత్తం 400మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్‌లు అందజేశారు. 2017లో హరిద్వార్‌లో జరిగిన పోటీల్లో రజత పతకం సాధించింది. 2025లో తంజావూరులో జరిగిన 3వ ఇంటర్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది.

● జాతీయస్థాయి పోటీలకు అవకాశం వచ్చినా...

పలుమార్లు జాతీయస్థాయిలో జరుగుతున్న పోటీల్లో పాల్గొనడానికి అవకాశం వచ్చినా ఆ సమయంలో పరీక్షల షెడ్యూలు ఉండటం వలన పాల్గొనలేకపోయింది. సరిత ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సమయంలోనే రుద్రమదేవి సెల్ఫ్‌డిఫెన్స్ అకాడమీలో కోచ్‌గా నియమించారు. అప్పటి నుంచి బాలికలు స్వీయరక్షణ ఎలాపొందాలి అనే అంశంపై జిల్లాలోని అన్ని కేజీబీవీ స్కూల్స్‌లో మహిళా ఉపాధ్యాయినిలతోపాటు విద్యార్థినిలకు శిక్షణ ఇచ్చింది. అదే విధంగా రాష్ట్రంలో ఎక్కడ పోటీల్లో పాల్గొనాలన్నా తన కిష్టమైన పల్సర్ బైక్‌లోనే తల్లితో కలిసి వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి పోటీల్లో పాల్గొనేది.

150 అడుగుల జెండాతో ర్యాలీ

హర్ ఘర్ తిరంగాలో భాగంగా రాపూరులోని జెమ్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు 150 అడుగుల మువ్వన్నెల జెండాతో ర్యాలీ నిర్వహించారు. కాపువీధి, సిద్ధలయ్య సెంటర్, పడమటి వీధి, పాత బస్టాండ్, బాలాజీ కాంప్లెక్స్ మీదుగా మేరా భారత్ మహాన్ నినాదాలతో ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, రాపూరు ఎంఈవో



శ్రీనివాసులు, జెమ్స్ అధినేత మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

రావి ఆకుపై త్రివర్ణ పతాకం!



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వీరంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని గోనుపల్లి అలకనంద రావి ఆకులపై వేసిన జాతీయపతాకం చిత్రం అందరిలోనూ దేశభక్తిని రగిలిస్తోంది. శనివారం కృష్ణాష్టమి కావడంతో రావి ఆకుపై చిన్ని కృష్ణుడు ఉన్నట్లు నీటిరంగులతో చిత్రాలను అందంగా తీర్చిదిద్దింది. ఈ రెండింటి ద్వారా ఆ విద్యార్థిని రెండు పండుగలకు తన అద్భుతమైన చిత్రాల ద్వారా శుభాకాంక్షలు తెలిపింది. తెలుగు పండి తుడు సోమా పద్మారత్నం చిత్రాలను గీయడంలో అలకనందకు మెళుకువలు నేర్పించారు. త్రివర్ణ పతాకం, శ్రీకృష్ణుని చిత్రాలు విద్యార్థుల హృదయాల్లో భక్తినీ, దేశభక్తినీ నింపుతాయని ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి):

సర్వీస్ హోమ్‌ల తనిఖీ

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ గురువారం జిల్లాలోని సర్వీస్ హోమ్‌లను తనిఖీ చేశారు. నగరంలోని గాంధీ నగర్‌లో ఉన్న సర్వీస్ హోమ్‌ను ప రిశీలించారు. భోజనం, సరుకుల నాణ్యత, నీటి వసతిపై అ క్కడ ఆశ్రయం పొందుతున్న వారిని అడిగి తెలుసుకున్నారు. హోమ్‌లో కూరగాయల తోటలను పరిశీలించారు. పీడీ వెంట మహిళా సంరక్షణ అధికారి టీ. అరుణ ఉన్నారు.

18న చలో కరేడు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18న చలో కరేడు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వామపక్ష నేతలు వెల్లడించారు. గురువారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడారు. ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోలార్ ఏర్పాటుకు 8400 ఎకరాలు కావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అయితే అక్కడి రైతులు తాము భూములు ఇచ్చేది లేదంటూ తెగేసి చెప్పారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ బలవంతపు సేకరణపై అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతా మని హెచ్చరించారు. అనంతరం చలో కరేడు పోస్టర్లను విడుదల చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్ వాజ్, సీపీఎం నేతలు చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

17న జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని క్రికెట్ క్రీడా ప్రాంగణంలో అండర్-23 మెన్ జిల్లా జట్టు ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్య దర్శులు ఎస్.రాజశేఖర్ రెడ్డి, కే.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతోపాటు సొంత కిట్స్‌తో, వైట్ అండ్ వైట్ డ్రస్ కోడ్‌తో 17న ఉదయం 8 గంటలకు స్టేడియంలో హాజరు కావాలని వారు తెలిపారు.

అధునాతన వసతులు... అరకొర వైద్యం

● ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ లేక ఇక్కట్లు ● 150 ఉండాల్సి ఉండగా 100 పడకలే దిక్కు
● రోగులకు తప్పని అవస్థలు

ఆత్మకూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఆత్మకూరులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జిల్లా వైద్యశాల నిరుపేదలకు వరంగా మారింది. కార్పొరేట్ హాస్పటల్‌కు దీటుగా ఈ వైద్యశాలలో అధునాతన చికిత్సలతోపాటు అన్నీ రోగాలకు మెరుగైన వైద్యసేవలు అందించే వైద్యనిపుణులు ఉండేవారు. దాంతో వైద్యశాలకు రోగుల తాకిడి అనూహ్యంగా పెరిగింది. సగటున రోజుకు 800 మందిపైబడి రోగులు చికిత్సల నిమిత్తం వస్తున్నారు. కానీ వైద్యశాలలో 150 పడకలు ఉండాల్సి ఉండగా, 100 పడకలు మాత్రమే ఉన్నాయి. దానికితోడు గత కొంత కాలంగా డాక్టర్లు, సిబ్బంది కొరత వెంటాడుతుండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

● ముఖ్య విభాగాల్లో డాక్టర్లేరీ ?

ఈ వైద్యశాలలో ముఖ్య విభాగాల్లో డాక్టర్లు లేక



ఆత్మకూరు ఆసుపత్రిలో ఓపీ కోసం బారులు తీరిన రోగులు

రోగులు ఇబ్బందులు పడుతున్నారు. 6 డాక్టరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 4 , డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ పోస్టులు 2 ఖాళీగా ఉన్నాయి. వాటితో పాటు సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. దాంతో ఫార్మసీ విభాగంలో పని వత్తిడి అధికంగా ఉంది. గైనకాలజీ విభాగంలో ముగ్గురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. హెడ్ నర్సుల పోస్టులు 3 ఖాళీగా ఉన్నాయి. ఈ వైద్యశాలలో నెలకు సరాసరిన 170 ప్రసవాలు జరగాల్సి ఉంది. కాని సరాసరిన 120 నుంచి 130 ప్రసవాలు జరుగుతున్నాయి. కష్టతరమైన కాన్పులను మాత్రం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపిస్తున్నారు.

● ఎంఆర్ఐ లేక ఇబ్బందులు

కొంత మంది రోగులకు ఎంఆర్ఐ స్కానింగ్ చేయాల్సి రావడం తప్పనిసరి అవుతుంది. అయితే ఇక్కడ ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. బయట ల్యాబ్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ తీయాలంటే రూ. 3000 వరకు ఖర్చు అవుతుంది. పేద ప్రజలు అంత ఖర్చు చేయలేక అవస్థలు పడుతున్నారు. లేదంటే వ్యయ ప్రయాసలకోర్చి నెల్లూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు వెళ్లి ఎంఆర్ఐ స్కానింగ్ తీయించుకోవాల్సి పరిస్థితి నెలకొని ఉంది.

ఎంఆర్ఐ స్కానింగ్ కూడా ఏర్పాటు చేస్తాం



ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల కార్పొరేట్ వైద్యశాలకు దీటుగా ఉంది. త్వరలో ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ కూడా ఏర్పాటు చేస్తాం. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. మందుల కొరత లేదు.

- డాక్టర్ కేవీ శేషారత్నం, సూపరింటెండెంట్

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఏడాది జైలు



ఎర్రచందనం స్మగ్లర్‌ను జైలుకు తరలిస్తున్న ఫారెస్ట్ అధికారి చక్రపాణి

నెల్లూరు(వెంకటేశ్వరపురం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్‌కు జైలుశిక్ష విధిస్తూ తిరుపతిలోని ఎర్రచందనం ప్రత్యేక కోర్టు గురువారం తీర్పు నిచ్చింది. రాపూరు మండలం పంగిలి గ్రామానికి చెందిన కరిపం నరసింహులుపై 2013లో ఎర్రచందనం స్మగ్లింగ్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి విచారణ జరిపిన తిరుపతి ప్రత్యేకకోర్టు నేర నిరూపణ కావడంతో ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించింది. దీంతో స్మగ్లర్ నరసింహులును నెల్లూరు జైలుకు తరలించారు. నేర నిరూపణ చేయడంలో ఎంతగానో కృషి చేసిన రాపూరు ఫారెస్టు సెక్షన్ అధికారి చక్రపాణిని రేంజర్ అభినందించారు. ఈ సందర్భంగా రాపూరు రేంజర్ రవీంద్రబాబు మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్‌కు ఎవరు పాల్పడినా వారికి శిక్ష తప్పదన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. 'అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్' పథకాల అమలులో భాగంగా తొలివిడత పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం కందుకూరులో రైతులు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు తొలి విడతగా కేంద్రం విడుదల చేసిన రూ.2 వేలకు తోడు మరో 5వేలు కలిపి మొత్తం 7 వేలు రైతుల ఖాతాలకు జమ చేశారన్నారు. కందుకూరు నియోజకవర్గంలోని రైతులకు ఈ పథకం ద్వారా రూ. 22.29 కోట్లు వారి ఖాతాలకు జమయ్యాయన్నారు. రైతులకు ప్రోత్సాహకంగా సబ్సిడీపై యంత్రపరికరాలు, డ్రోన్లు అందజేశామన్నారు. రైతుల జీవనాడిగా ఉన్న రాళ్లపాడు ఆయకట్టులో చివరి ఎకరానికి కూడా సాగు నీరందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన రైతు నాయకులు ఎన్వీ సుబ్బారావు, గోగినేని శివరామయ్యలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణా రెడ్డి, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీ నరసింహం, బీజేపీ నాయకుడు ఘట్టమనేని హరిబాబు, జనసేన నాయకులు గోకరాజు మదన్, కొణిదెల శ్రీను పాల్గొన్నారు.



కందుకూరులో ఎడ్లబండి నడుపుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా అధికారులు, సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఆయా వ్యాధులు నమోదవుతున్నాయని, వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలకు తగిన సూచనలు చేయాలన్నారు. స్థానికంగా నివాసం ఉంటున్న వారి గృహాలను సందర్శించాలని, ఆయా నివాసాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఆయా నీటి నిల్వల లోనే దోమల లార్వా పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. నీటి గుంటలను గుర్తించి గంబూసియా చేపలు వదలాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, సబ్‌యూనిట్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ

ఎక్కడ.. ఎవరికి వేశారు ?

● విద్యార్థులందరికీ నులిపురుగుల మాత్రలంటూ అధికారుల ప్రచారం
● ప్రైవేటు స్కూళ్లు,కాలేజీల్లో అమలుకాని డీవార్మింగ్
● 96.82 శాతం ఫలితాలు సాధించినట్లు కాకిలెక్కలు
● సొంతశాఖ ఉద్యోగులే విమర్శలు



ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి(ఫైల్)

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వైద్య, ఆరోగ్యకార్యక్రమాలకు అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ఈనెల 12న జిల్లావ్యాప్తంగా డీవార్మింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశా లలు, కళాశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివార ణకు ఆల్బెండజోల్ మాత్రలు మిగించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కలిపి 5,75,806 మంది విద్యార్థులను గుర్తించారు. అదే రోజు సాయంత్రానికి 96.82 శాతం మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించినట్లు వైద్యాధికారులు ప్రకటించారు. అయితే అవన్నీ కాకిలెక్కలేనని కొందరు వైద్యులు, సిబ్బంది చెబుతున్నారు. కేవలం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే ఈ కార్యక్రమం నిర్వహించి చేతులు దులుపుకున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● సొంతశాఖలోనే విమర్శలు

జిల్లాలో 2,912 అంగన్‌వాడీలు, 2,594 ప్రభుత్వ పాఠశాలలు, 60 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 3,42,497 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 2,12,141 మంది విద్యార్థులు చదువుతున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలకు సంబంధించి 24,658 మంది విద్యార్థులు డీవార్మింగ్‌కు అర్హులుగా వైద్యాధికారులు నిర్ధారించారు. అయితే కేవలం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే ఈ డీవార్మింగ్ నిర్వహించి, 96 శాతానికి పైగా విద్యార్థులకు డీవార్మింగ్ చేపట్టామని అధికారులు ప్రకటించటం విమర్శలకు తావిస్తుంది. అధికారులు తప్పుడు లెక్కలు చూపించి విజయవంతం చేశామని ప్రకటించిన తీరుపై సొంత శాఖ ఉద్యోగులే పెదవి విరుస్తున్నారు.

● మావైపే రాలేదు..

తమవైపే వైద్యాధికారులు రాలేదని అధికసంఖ్యలో ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల నిర్వాహకులు చెబుతున్నారు. ఏదో కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో తప్ప మరెక్కడా డీవార్మింగ్ చేపట్టలేదని తెలుస్తోంది. ఏదో మొక్కుబడిగా కార్యక్రమం నిర్వహించి లక్ష్యాలు పూర్తి చేసినట్లు అధికారులు చెప్పటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

దర్గాలో డిజిటల్ మ్యాపింగ్

ఏఎస్ పేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ఖాజానాయబ్ రసూల్ దర్గాలో సర్వే అధికారులు డిజిటల్ మ్యాపింగ్ నిర్వహించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చెర్మన్ అబ్దుల్ అజీజ్ ఆదేశాలతో దర్గాలో పలు అభివృద్ధి కార్యక్రమలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం దర్గా ఈవో హుసేన్‌తో కలిసి సర్వేయర్లు అజీద్, మొహమ్మద్‌లు దర్గా పరిసరాలను సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9576
వెండి కిలో ధర	రూ. 118300
వెండి ఒక గ్రాము	రూ. 121.30

న్యూస్ బాక్స్

వైభవంగా పల్లకీ సేవ



అమ్మవారికి పల్లకిసేవ నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు

దుత్తలూరు (ఉదయగిరి), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈసందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణలు చేపట్టారు. పూర్వ విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈసందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

కృష్ణాష్టమి వేడుకలు



గోపిక,కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు

సీతారామపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేదగర్భ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో అడ్మిన్ డైరెక్టర్ కనుముల్లపూడి పవన్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు గోపికలు, కృష్ణుడి వేషధారణలో అలరించారు. ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి నరేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పంచాయతీ కార్యదర్శులకు దుస్తులు అందజేస్తున్న ఎంపీడీవో

ఉదయగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో దుత్తలూరు సీడ్స్ స్వచ్ఛంద సంస్థ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వితరణ చేసిన యూనిఫాం దుస్తులను గురువారం ఎంపీడీవో అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లాలు పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తొలివిడతగా మేజర్ పంచాయతీ అయిన ఉదయగిరి పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. త్వరలో మండలంలోని అన్ని పంచాయతీలకు దుస్తులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్స్ సంస్థ ప్రతినిధి సతీష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంపై ఇంటింటి ప్రచారం



ధ్యానంపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాస్టర్ తదితరులు

వింజమూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీవేద వ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం మాస్టర్ హేమలత ఆధ్వర్యంలో పట్టణంలోని గంగమెట్ట, సిద్ధార్థ నగర్ ప్రాంతాలలో ప్రతి ఇంటికీ తిరిగి ధ్యానం, శాకాహారం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరమ్మ, జయప్రద, కౌసల్య, స్వప్న, తులసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌గా రాజశేఖర్ ప్రమాణ స్వీకారం



సొసైటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

సీతారామపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మారంరెడ్డిపల్లి సొసైటీ చైర్మన్‌గా సోమనబోయిన రాజశేఖర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం డైరెక్టర్ల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పాల్గొని వారికి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

ముస్తాబైన ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వసతిగృహాలు



సంగం: పంద్రాగస్టు వేడుకలకు సిద్ధం చేస్తున్న జెండాలు

ఆత్మకూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాల యాలను ముస్తాబుచేశారు. ఈసందర్భంగా పాఠశా లలు, కార్యాలయాలతో పాటు ప్రభుత్వ వసతి గృహాలను విద్యార్థులు రంగురంగుల కాగితాలు, తోరణాలు కట్టి అలంకరించారు. జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు సిద్ధంచేశారు. స్వచ్ఛంద సేవా సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, ఆయా ప్రాంతాల్లో జెండాదిమ్మెలు ఏర్పాటు చేశారు. జెండాలు, బ్యాడ్జీలకు డిమాండ్ ఏర్పడింది. కాగా, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు స్వాతంత్ర్య వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నారు.

● సంగం : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు సిద్ధంచేశారు. అందులో భాగంగా గురువారం మండల కేంద్రంలోని తహసీల్దారు, మండల పరిషత్, పోలీస్‌స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్, వైద్యశాల, కళాశాలలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల్లో మువ్వన్నెల జెండాలు అతికించారు. పాఠశాలల్లో విద్యార్థులు తరగతి గదులను రంగురంగుల కాగితాలు, ముగ్గులతో అలంకరించి ముస్తాబు చేశారు.

పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది : పొన్నెబోయిన



ఉదయగిరి: మిఠాయిలు తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు



సీతారామపురం: బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

ఉదయగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించడంతో గురువారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో వైసీపీకి ధరావత్తు కూడా దక్కలేదన్నారు. జగన్ అరాచకాలకు అక్కడి ప్రజలు విసిగిపోయి స్వచ్ఛందంగా తరలి వచ్చి ఓటు ద్వారా బుద్ధి చెప్పారన్నారు. పులివెందుల అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరిగినా జగన్‌కు ఓటమి తప్పదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏడాది పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఇదేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

●సీతారామపురం: పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో మండల టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, జాషువా, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, తోట మనోజ్, ఎస్ రాజశేఖర్, తోట ఏడుకొండలు, దేవర వెంకటేశ్వర్లు, వీకాష్‌బాబు, తిరుపతయ్య, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల పేరుతో బలవంతపు భూసేకరణ దారుణం

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కటారి
● 18న చలో కరేడును విజయవంతం చేయాలి



ఉదయగిరి: విలేకరులతో మాట్లాడుతున్న కటారి అజయ్‌కుమార్

ఉదయగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశ్రమల పేరుతో బలవంతపు భూసేకరణ చేయడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కటారి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలోని కరేడులో ఇండోసోల్ కంపెనీకి 8వేల ఎకరాల భూమిని సేకరించేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు. ఏడాదికి మూడుకార్ల వరి పండించడంతోపాటు పండ్లతోటల సాగులో దేశానికి ఆదర్శంగా ఉందన్నారు. తమ భూములు ఇవ్వమని ఒకటిన్నర మాసంగా ప్రజలు పోరాడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. లింగసముద్రం మాలకొండస్వామి ఆలయం చుట్టూ ఉన్న నాలుగు గ్రామాల పరిసర ప్రాంత భూముల్లో 19 చదరపు కిలోమీటర్ల మేర ఇనుప ఖనిజం ఉందన్నారు. గత ప్రభుత్వం వాటిని తవ్వుకునేందుకు జిందాల్ కంపెనీకి అనుమతులు ఇస్తూ జీవో జారీ చేయగా ప్రస్తుత ప్రభుత్వం దానిని అమలు చేస్తోందన్నారు. వరికుంటపాడు పంచాయతీ జంగంరెడ్డిపల్లి మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. కరేడులో భూసేకరణను నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని రైతు సంఘాలతో కలిసి ఈనెల 18న చలో కరేడు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, ఫరుద్దీన్‌బాషా, కామాక్షమ్మ, పందిళ్ల వెంకటేశ్వర్లు, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

18న కరేడుకు తరలిరావాలి

● **ఏఎస్ పేట:** కరేడులో జరుగుతున్న అక్రమాలపై ప్రశ్నించడానికి ఈనెల 18వ తేదీన సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న చలో కరేడు కార్యక్రమానికి తరలిరావాలని రాష్ట్ర కౌలు రైతు సంఘం నాయకుడు గంట లక్ష్మీపతి కోరారు. గురువారం ఆయన ఏఎస్ పేటలో సిపిఎం డివిజన్, మండల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ కందుకూరులోని ఉలవపాడు సమీపంలోని కరేడు గ్రామంలో మూడు పంటలు పండే పొలాలను ఇండోర్ సోలార్ కంపెనీకి ఇచ్చేందుకు ప్రయత్నిస్తోందని, దీనితో రైతులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని అడ్డుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో రైతు, కౌలు రైతు, కార్మిక సంఘాలు పాల్గొనాలని కోరారు.

రహదారులపై పశువుల సంచారం

● ప్రమాదాల బారిన వాహనదారులు



167-బీజీ జాతీయ రహదారిపై సంచరిస్తున్న గేదెలు

ఉదయగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై పశువుల సంచారంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా దుత్తలూరు-సీతారామపురం, వరికుంటపాడు-పీపీకుంట సరిహద్దు మార్గాల్లో గల 167-బీజీ, 565 జాతీయ రహదారులపై రెండు రోజులకోసారి గేదెలు ఢీకొని వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈప్రమాదంలో వాహనదారులు కొందరు మృతిచెందుతుండగా, మరికొందరు క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. ప్రమాదంలో గేదెలు సైతం మృత్యువాతపడుతున్నాయి. దీంతో వాహనదారులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతుంటే, పాడిపై ఆధారపడి జీవిస్తున్న రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గేదెలను యజమానులు సంరక్షించుకునేలా అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని వాహనదారలు కోరుతున్నారు.

సచివాలయాల్లో ఫైబర్‌నెట్ సౌకర్యం లేక

నిరుపయోగంగా సామగ్రి



జీ.కొండారెడ్డిపల్లి సచివా లయ ంలో నిరుపయోగంగా ఉన్న సామగ్రి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రచార ఆర్భాటమే తప్ప ఆచరణ శూన్యం అన్నట్లు పరిపాలన సాగింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన మానస పుత్రికగా చెప్పుకొనే గ్రామ సచివాలయ వ్యవస్థ నేటికీ పూర్తిస్థాయి కార్యరూపం దాల్చలేదనే చెప్పుకోవచ్చు. అప్పట్లో ఎంతో ఆర్భాటంగా ప్రతి సచివాలయానికి ఫైబర్ నెట్ సామగ్రి సరఫరా చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఏళ్ల తరబడి వినియోగానికి నోచుకోకపోవడంతో అవి తుప్పుపట్టి పాడైపోతున్నాయి. సచివాలయాల్లో పరిపాలన సౌలభ్యంతో పాటు గ్రామాల్లోని నివాసాలకు సైతం తక్కువ ఖర్చుతో నెట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పి వాటి వినియోగానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో వాటికి సంబంధించిన సామగ్రి నిరుపయోగంగా మారి అలంకారప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. పనులపై సచివాలయాలకు వెళ్లిన ప్రజలు దుమ్మూ, ధూళితో నిండిన విలువైన సామగ్రిని చూసి నాటి వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందంటూ మండిపడుతున్నారు. కనీసం ప్రస్తుత ప్రభుత్వమైనా దృష్టి సారించి విలువైన సామగ్రిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం

● భయాందోళనలో పాఠకులు
● వర్షపు నీటితో పాడవుతున్న పుస్తకాలు
● పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనం



పుస్తకాలు తడవకుండా కప్పిన పట్టలు

ఏఎస్ పేట, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందోనని పాఠకులు భయాందోళన చెందుతున్నారు. గ్రంథాలయంలో ఎంతో విలువైన పుస్తకాలు ఉండడంతో నిత్యం విద్యార్థులు, నిరుద్యోగులు విచ్చేస్తుంటారు. గ్రూపు1 నుంచి ఎన్నో రకాల పోటీ పరీక్షల మెటీరియల్‌తో పాటు విజ్ఞానం, వినోదం, సైన్స్, గణితం వంటి అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉండడంతో ఏఎస్ పేటతో పాటు చుట్టుపక్కల గ్రామాలలోని యువకులు ప్రతిరోజు గ్రంథాయానికి విచ్చేసి పోటీ పరీక్షల మెటీరియల్ చదువుతుంటారు. పలువురు ఇక్కడి పుస్తకాలు చదివి ఉద్యోగాలు పొందిన వారు ఉన్నారు. ఇంత ప్రాముఖ్యత ఉన్న గ్రంథాలయ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరి స్లాబు పెచ్చులూడి కమ్మిలు బయటపడ్డాయి. స్లాబు కొంత కిందికి ఒరిగి ఎప్పుడు కూలుతుందోనని పాఠకులు గ్రంథాలయనికి రావడానికి భయందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షానికే స్లాబు కురుస్తుండడంతో గ్రంథాలయంలోని పుస్తకాలను భద్రపరచడం తలకు మించిన భారంగా మారిందని గ్రంథాలయ అధికారి ఆవేదన చెందుతున్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలు వర్షపు నీటికి తడవకుండా ఉండడం కోసం పట్టలను కప్పి ఉంచుతున్నారు. కానీ జోరు వర్షంతో స్లాబు ఎక్కువగా కురిసినప్పుడు మాత్రం పుస్తకాలను పూర్తిగా కాపాడుకోవడానికి ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించాలని, అప్పటివరకు గ్రంథాలయానికి వేరే భవనం కేటాయించాలని గ్రంథాలయానికి వచ్చే పాఠకులు కోరుతున్నారు.

ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం



ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న గుర్రం గోపి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా గురువారం జడదేవి గ్రామానికి చెందిన గుర్రం గోపి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయనతో పాటు డైరెక్టర్లుగా వేంపాడు గ్రామానికి చెందిన మానం కొండలరావు, తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మేడిద వెంకటేశ్వర్లు చేత సీఈవో రత్తయ్య ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి తమవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జె లక్ష్మీనారాయణ, జనసేన కన్వీనర్ పఠాన్ రసూల్ నాయకులు చంద్ర వెంకయ్య, నాదిండ్ల రాజేంద్ర, నూనె ప్రసాద్, తెల్లగొర్ల వెంకటయ్య, పొద మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థినికి స్కాలర్ షిప్ అందజేస్తున్న రత్నకుమారి

ఏఎస్ పేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చదువులో ప్రతిభ చూపిన జడ్పీ హైస్కూల్ ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు గురువారం కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. 2024-2025 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చూపిన పదవ తరగతి పూజిత, 9వ తరగతి అంజన, 8వ తరగతి మౌనికలకు రూ. 5వేలు చొప్పున, 7వ తరగతి ప్రహల్య, 6వ తరగతి జాహ్నవి, 5వ తరగతి అనన్యలకు 3వేల రూపాయల చొప్పున స్కాలర్‌షిప్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రుక్మిణి, అసిస్టెంట్ బ్యాంక్ మేనేజరు రత్నకుమారి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న బాధితులు

వింజమూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి 33మంది బాధిత కుటుంబాలకు సుమారు రూ.51,76,650 పంపిణీ చేశారు. వింజమూరు మండలంలో శంఖవరం గ్రామానికి చెందిన అలపాటి శ్రీలతకు రూ. 12,62,120 సీఎం సహాయనిధి చెక్కును మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో 8 మండలాల తెలుగుదేశం పార్టీ కన్వీనర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా



కొండయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారిగా గుత్తి కొండయ్య స్థానిక విద్యావనరుల కేంద్రంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కాగా, ఎంఈవో-2 రమణయ్యతో సహా సీఆర్పీలు, సిబ్బంది ఆయన్ను శాలువాలు, పూలమాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు

వింజమూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి వింజమూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే దారికి ఇరువైపులా టీడీపీ సీనియర్ నాయకుడు గువ్వల కృష్ణారెడ్డి దాతృత్వంలో 20 విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా ఈ మార్గంలో ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలంటే రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి ప్రజలు సమస్యను వివరించడంతో వెంటనే ఆయన స్పందించి వింజమూరు మండలం సీనియర్ నాయకుడు గువ్వల కృష్ణారెడ్డి ద్వారా విద్యుత్ లైట్లను ఏర్పాటుచేయించారు.

ట్రాఫిక్ సమస్యతో వాహనదారుల అవస్థలు



బస్టాండ్ సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్

అనంతసాగరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు మీదకు వ్యాపార సముదాయాలు విస్తరించాయి. ఆవులను రోడ్లపై వదిలేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఏఎస్ పేటలో...

ఏఎస్ పేట : ప్రముఖ యాత్రాస్థలం అయిన ఏఎస్ పేటలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నాయబ్‌రసూల్ దర్గా ఉండడంతో మన రాష్ట్రం నుంచే కాక పలు రాష్ట్రాల నుంచి యాత్రికులు విచ్చేస్తుంటారు. గ్రామంలో ఎక్కడా పార్కింగ్ స్థలం కేటాయించలేదు. దీంతో దర్గా సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గ్రామంలోని నగరఖానా సెంటర్, బస్టాండ్ సెంటర్‌లో వాహనాలను రోడ్డులో అడ్డుగా పెట్టడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. బస్టాండ్ సెంటర్‌లో బస్సులు నిలిపే స్థలం లేదు. దీంతో ఆత్మకూరు, నెల్లూరు తదితర బస్సులు బస్టాండ్ సెంటర్‌లో ఆపి ఉన్న సమయంలో మరో వాహనం వస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామంలో బస్టాండ్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్‌ను నియంత్రించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 520

292 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతు లు మొత్తం 512 పొగాకు బేళ్ల అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో ఎనిమిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 220 బేళ్ల కొనుగోలు చేశారు. నోసేల్-11, నోబిడ్-261, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-12 కారణాలతో 292బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.140, సగటు ధర రూ.185.33గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

వెరికోస్ వీన్స్ వ్యాధిపై అవగాహన

కావలి(టౌన్) ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): వెరికోస్ వీన్స్‌కు ఆధునిక చికిత్స అందు బాటులో ఉందని నెల్లూరు మెడికవర్ ఆసుపత్రికి చెందిన వెరికోస్ వీన్స్ వైద్యనిపు ణుడు డాక్టర్ వై సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కోఆపరేటివ్ కాలనీలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో దిపూర్ పీపుల్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వెరికోస్ వీన్స్ వ్యాధిపై అవగాహన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జానికిరామ్, ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చేవూరి చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా జాతీయ రహదారి పనులు

● వాహనదారుల అవస్థలు



కలిగిరిలో ప్రమాదకరంగా టిప్పర్ల ప్రయాణం



రహదారిపై చెల్లాచెదురుగా పడిఉన్న కంకర

కలిగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కావలి నుంచి దుత్తలూరు వరకు జరుగుతున్న జాతీయ రహదారిపనులు ఒక విధానం లేకుండా ఇష్టానుసారంగా చేస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా కలిగిరి-కావలి, కలిగిరి-వింజమూరు మార్గాల్లో కలిగిరి శివారు ప్రాంతాల్లో రహదారి పనులు నెలలతరబడి నత్తనడకన సాగుతున్నాయి. జనసంచారం లేని ప్రాంతాల వద్ద యుద్ధప్రాతిపదికన రహదారి పనులు పూర్తికాగా పట్టణ ప్రాంతాల వద్ద పనులు మందకొడిగా సాగుతున్నాయి. ముఖ్యంగా కలిగిరి పట్టణంలో తహసీల్దారు కార్యాలయం నుంచి కెనరాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖల వరకు కేవలం అరకిలోమీటరు పనులు ఆరు నెలల నుంచి సాగుతున్నాయి. పనులు జరుగుతున్న ప్రాంతంలో కంకర రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకున్న దాఖలాలే లేవు. ఈ ప్రదేశం వివిధ పనులపై కార్యాలయాలకు, ప్రయాణాలు చేసేవారితో రద్దీగా ఉంటుంది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఈ ప్రదేశంలో భయపడుతూ వెళ్లాల్సి వస్తోందని, టిప్పర్లు అతివేగంతో ప్రయాణించడం వలన తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారే లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఈక్రమంలో గురువారం కెనరాబ్యాంకు ఆవరణలో పార్క్ చేసిన మేనేజరు కారు, వేగంగావెళ్తున్న టిప్పర్ దాటికి రోడ్డుపై పడిఉన్న కంకరరాళ్ళు కారు అద్దంపై పడి పగిలిపో యింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీ య రహదారి పనులు త్వరగా పూర్తిచేసి ప్రమాదాలు నివారిం చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



రహదారిపైఉన్న కంకర తగిలి పగిలిన కారు అద్దం

కావలి(టౌన్), ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): జై జవాన్.. జై కిసాన్ అంటూ ఎన్సీసీ విద్యార్థులు తిరంగా జెండాలు చేతపట్టి గురువారం నిర్వహించిన ర్యాలీ పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాల ఎన్సీసీ అధికారి మస్తాన్‌వలి పర్యవేక్షణలో జరిగిన ర్యాలీని ముందుగా పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయిని సుజాత ర్యాలీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దయాలత, శ్రీదేవి, లక్ష్మీపావని, రోహిణి, ఎన్సీసీ కేడెట్లు తదితరులు పాల్గొన్నారు.

● కొండాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున ఆధ్వర్యంలో స్థానిక ఆదర్శ పాఠశాల నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటుచేశారు. జాతీయ జెండా ప్రాముఖ్యతను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఖాదర్‌బాష విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓరుగంటి మాధవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



త్రివర్ణ పతాకాలు చేతపట్టి ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్సీసీ విద్యార్థులు

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు చాకిచర్ల విద్యార్థులు



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన రాజేష్, మహేష్

ఉలవపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-15 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు చాకి చర్ల గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బీ. రాజేష్, వీ. మహేష్‌లు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యా యుడు కే జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లా త్రోవగుంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జిలాస్థాయి వాలీబాల్ పోటీల్లో ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనబరచగా, అందులో ఇద్దరు చాకిచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉండడం విశేషమన్నారు. ఈనెల 18న వీరు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపా ధ్యాయుడు ఓగుబోయిన శ్రీనివాసులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, గ్రామపె ద్దలు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుధాకర్ విద్యార్థులను అభినందించారు.

ట్రాక్టర్ల ర్యాలీకి తరలివెళ్లిన రైతులు



ట్రాక్టర్లతో కందుకూరుకు తరలి వెలుతున్న గుడ్లూరు రైతన్నలు

గుడ్లూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' పథకాల ద్వారా రైతులకు తొలివిడత పెట్టుబడి సాయం అందిన సందర్భంగా కందుకూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ట్రాక్టర్ ర్యాలీ, బహిరంగ సభకు గుడ్లూరు మండలం నుంచి గురువారం అధికసంఖ్యలో రైతులు తరలివెళ్లారు. తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు జనిగర్ల నాగరాజు టీడీపీ జెండా ఊపి ర్యాలీని ప్రాంభించారు. రైతన్నల కష్టాలను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సాయం అందించడం శుభపరిణామమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిత్తారి మల్లికార్జున, పువ్వాడి వేణుగోపాల్, రావూరి వేణు, గుడ్లూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉన్నం వెంకటేశ్వర్లు, మేకపోతుల రాఘవయ్య, అక్కిలగుంట ప్రకాశం, పఠ్రై మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా

బిట్రగుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో బుధవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిన విషయం తెలుసుకున్న మండల విద్యుత్ ఏఈ జడరాయ వెంటనే స్పందించి గ్రామంలో యుద్ధప్రాతిపకన విద్యుత్ సరఫరా చేయించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిన విషయం ఆంధ్రజ్యోతికి తెలిసిన వెంటనే అధికారులను అప్రమత్తం చేయడం జరి గింది. ప్రజలు ఇబ్బందులు పడకుండా యుద్ధప్రాతిపధికన ఏఈ సిబ్బందితో రాత్రి 10గంటు లోపు విద్యుత్ సరఫరా అందచే శారు. అందుకు స్థానికులు ఏఈ, సిబ్బందితో పాటు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలియచేశారు.

పులివెందులలో టీడీపీ గెలుపు ప్రజావిజయం

నెల్లూరు (వైద్యం)/సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీకి చారిత్రాత్మక విజయం నమోదయిందని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జడ్పీటీసీగా ఎన్నికయిన మారెడ్డి లతారెడ్డికి శుభా కాంక్షలు తెలియచేశారు. కాగా పులివెందులలో గత 30 ఏళ్ల తరువాత అక్కడ ఓటర్లు స్వే చ్ఛగా తమ హక్కును వినియోగించుకున్నారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. అక్కడ వైసీపీ అభ్య ర్థికి డిపాజిట్లు కూడా రాకపోవడాన్ని జగన్ గుర్తించి తన అహంకారాన్ని తగ్గించుకోవాలని నారాయణ పేర్కొన్నారు.

నేడు శ్రావణ శుక్రవారం వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అమ్మవా రి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఉదయం లక్ష కుంకుమార్చన, సాయంత్రం పూలంగిసేవ, పల్లకీసేవ నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

● ఇరుగాళమ్మ ఆలయంలో ఉదయం 6గంటలకు మూలవర్లుకు అభిషేకాలు, 8గంటలకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా వందనం ఉంటుందని ఈవో వీగిరి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 9గంటలకు వాసన్ కేర్ ఆసుపత్రి ఆ ధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తామని, సాయంత్రం 4గంటలకు గ ణపతి, శ్రీరుద్ర, మహాలక్ష్మీ హోమాలు, ఉత్సవమూర్తులకు తిరుమంజనం సేవ, రాత్రి పుష్పయాగం నిర్వహిస్తామన్నారు.

● కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం సామూహిక కుంకుమ పూజ, సాయంత్రం పూలంగిసేవ, రాత్రి పసుపు కుంకుమల పంపిణీ ఉంటుందని ఆలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు షణ్ముఖరావు తెలిపారు.

నేడు వరలక్ష్మీ వ్రతం : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు వరలక్ష్మీ వ్రతం నిర్వహించన్నుట్లు ఈవో అళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పేదల పెళ్లిళ్లకు మాలేపాటి కుటుంబం పెద్దదిక్కు

దగదర్తి (బిట్రగుంట) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలంలోని పేదల ఇంట పెళ్లిలకు మాలేపాటి కుటుంబం పెద్దదిక్కుగా నిలిచి మంగళసూత్రం అందచేయడం ఆనవాయితీ అని మాజీ జడ్పీటీసీ మాలేపాటి పద్మావతి అన్నారు. దగదర్తి మండలం తురిమెల్ల పంచాయతీ లక్ష్మీనారాయణపురానికి చెందిన గంగపట్ల అంజయ్య, ఇందుల కుమారుడు అవినాష్ వివాహానికి గురువారం మంగళసూత్రం అందచేసి ఆమె ఆశీర్వదించారు.

ఫ్లోరోసిస్ నివారణకు చర్యలు తీసుకోవాలి

● జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ దివ్య



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డా.దివ్య

లింగసముద్రం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఫ్లోరోసిస్ నివారణకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంటు డా. దివ్య పేర్కొన్నారు. లింగసముద్రం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉదయం సీహెచ్ఓ శ్రీనివాసులు అధ్యక్షతన ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లకు ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఫ్లోరైడ్ అధికంగా ఉన్న భూగర్భ జలాలు, టీ కషాయం, బ్లాక్ సాల్ట్, సుపారీ, సోడియం ఫ్లోరైడ్ బిళ్లలు, గనుల తవ్వకం, బొగ్గును కాల్చడం వల్ల ఫ్లోరోసిస్ వస్తుందన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా పిల్లలు, పెద్దలు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, గుండె, కిడ్నీ సంబంధిత జబ్బులు ఉన్న రోగులకు వస్తుందన్నారు. రక్షిత తాగునీరు, పాలు, పెరుగు, జున్ను, బెల్లం, పచ్చటి ఆకు కూరలు, జీలకర్ర, మునగకాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, జామ, నిమ్మ, ఉసిరి, నారింజ, టమోటా మొదలైనవాటిలో ఫ్లోరోసిస్ నుంచి రక్షించే ఔషధ గుణాలు ఉంటాయన్నారు. ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్న నీరు, ఆహారంతో పాటు పొగాకు సేవించడం వల్ల ఈ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టీ అనిత, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వలేటివారిపాలెంలో విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ దివ్య

ఫ్లోరోసిస్ వ్యాధి పై అవగాహన

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేద్రంలో ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలపై గురువారం జిల్లా నేషనల్ ఫ్లోరోసిస్ సర్వేలెన్స్ అధికారిణి డాక్టర్ దివ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం స్థానిక వైద్యాధికారి శివశిద్దప్ప అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ దివ్య మాట్లాడుతూ ఫ్లోరోసిస్ సోకితే పిల్లలకు దంతాలు పచ్చగా మారడం, కాళ్లు వంకర్లు పోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. అలాంటి పిల్లలకు చికిత్స చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం పోకూరు, బడేవారిపాలెం పాఠశాలల్లో విద్యార్థుల దంతాలు, కాళ్లు చేతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శివశిద్దప్ప, సీహెచ్ఓ శివరామయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో జెండా దిమ్మె ఏర్పాటు



మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెండా దిమ్మె

కావలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కావలి మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ కోసం దిమ్మెను ఏర్పాటు చేశారు. గతంలో స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్‌డే రోజు న జాతీయజెండా ఆవిష్కరించాలంటే మున్సి పల్ కార్యాలయం పైన రెండో అంతస్తు పైభా గాన గోడకు ఒక జెండా కర్రను ఏర్పాటుచేసి దానికి జాతీయ జెండా కట్టి ఆవిష్కరించేవారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో జెండా వం దనం కార్యక్రమం అంటే పాల్గొనేందుకు ప్రజ లు వెనుకాడేవారు. దీనిని గుర్తించిన మున్సిపల్ అధికారులు జాతీయ జెండా ఆవిష్కరణ కార్య క్రమం కిందనే జరిపితే అందరికీ అనుకూలంగా ఉంటుందని భావించి కార్యాలయం ముందు భాగాన జాతీయ జెండా దిమ్మెను నూతనంగా ఏర్పాటు చేశారు. దీంతో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నూతన దిమ్మె వద్ద జెండా ఆవిష్కరణ జరిపేందుకు సిద్ధమయ్యారు.

స్వాతంత్ర్య వేడుకలకు రంగం సిద్ధం

అల్లూరు: మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. తహసీల్దారు, ఎంపీడీఓ, సబ్ రిజిస్ట్రారు, కమిషనర్ కార్యాలయాలతోపాటు పోలీసు స్టేషన్, సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ రంగ కార్యాలయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడనుంది. ఉదయం 8 గంటలకే జెండాను ఎగురవేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు.

బ్రాహ్మణుల అభ్యున్నతి టీడీపీతోనే : గంగు


కావలి(టౌన్), ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి): బ్రాహ్మణుల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ నాయ కుడు, బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు గంగు వెంకటచంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం పాతూరులోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బ్రాహ్మణ కులానికి చెందిన టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం కావలిలో ప్రతిష్ఠించేలా బ్రాహ్మణ సంఘం పెద్దలందరూ కలిసి ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని కోరనున్నామన్నారు. బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్ద పీట వేసింది చంద్రబాబు నాయుడేనన్నారు. విజయవాడ గొల్లపూడిలో బ్రాహ్మణ కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని రకాల సదుపాయాలు, భోజన సదుపాయం ఉందని, పనుల నిమిత్తం విజయవాడ వెళ్ళే బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తైక్వోండో శిక్షణతో శత్రువుల నుంచి రక్షణ



తైక్వోండో విద్యార్థులకు బెల్ట్స్ అందచేస్తున్న ఎన్ఎస్ యాదవ్

బిట్రగుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తైక్వోండో మార్షల్ ఆర్ట్ నేర్చుకోవడం వలన తనకుతానుగా శత్రువుల నుంచి రక్షించుకోవచ్చని వాకర్స్ మాజీ అధ్యక్షుడు ఎన్ఎస్ యాదవ్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో గురువారం ఇంటర్ నేషనల్ మాస్టర్ ఈ రవిగన్ తైక్వోండో విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని బెల్ట్స్ అందచేస్తునట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిట్రగుంట వాకర్స్ అధ్యక్షులు బీ బర్నాడ్, వాకర్స్ సభ్యులు స్వర్ణన్‌రాజు, పీ జీవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పాతూరులో పంట కాలువ వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుపై రంధ్రం

కల్వర్టుపై రంధ్రం

● పొంచి ఉన్న ప్రమాదం

కావలి, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం పాతూరులోని అక్కమ్మబావి సెంటర్ సమీపంలో పంటకాలువ వద్ద నాలుగు రోడ్ల కూడలిలో కల్వర్ట్‌ను పగుల కొట్టడంతో అక్కడ పెద్ద రంధ్రం పడి ప్రమాదం పొంచి ఉంది. ఆ కల్వర్ట్ కింద ఉన్న మంచినీటి పైపులైన్ లీకేజీ అవుతుండటంతో దాని మరమ్మతుల కోసం కల్వర్ట్‌ను మధ్యలో పగులకొట్టారు. ఈప్రాంతంలో ప్రజలు, వాహనాల రాకపోకలు నిత్యం రద్దీగా ఉంటాయి. దీంతో రాత్రి పూట ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి రంధ్రాన్ని త్వరగా పూడ్చి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు (క్రైం) ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బైక్ చోరీపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం సదాశివపురానికి చెందిన పీ. మునిశంకర్ ఈ నెల 9న నెల్లూరుకి వచ్చారు. హెచ్ఆర్ కల్యాణమండపం సమీపంలోని హోటల్ వద్ద పార్క్ చేసిన బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు వేదాయపాలెం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు.



8 వ పేజీలో

అర్ధ శతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్రమందామా..
స్వర్ణోత్సవాలు చేద్దామా?

ఆత్మ వినాశపు అరాచకత్వాన్ని స్వరాజ్యమందామా..
సలాము చేద్దామా?

... స్వాతంత్ర్యం లభించి 50 ఏళ్లు అయిన సందర్భంగా దేశం సంబరాలు జరుపుకుంటున్న వేళ.. 1997లో సినీ కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి దుఃఖ ధిక్కారపు స్వరంతో సమాజానికి పాట రూపంలో సంధించిన ప్రశ్నలు ఇవి.

... మరో 28 ఏళ్లు గడిచిపోయాయి. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతూనే ఉన్నాయి. మరి... పరిస్థితులు మారుతున్నాయా? పేదల బతుకులు మెరుగవుతున్నాయా? పల్లెలు బాగుపడుతున్నాయా? ప్రశ్నలు మళ్లీ మళ్లీ సంధించుకోవాల్సిన సందర్భం ఇది. సంబరాలు జరుపుకొంటూనే సమస్యల్ని గుర్తు చేసుకుని పరిష్కారానికి సంకల్పం చెప్పుకోవాల్సిన సమయం ఇది.



స్వాతంత్ర్య సంబరాలకు స్వాగతం పలుకుతున్నట్టుగా గురువారం సాయంత్రం తిరుపతిలో విరిసిన ఇంద్రధనస్సు త్రివర్ణాలతో కనువిందు చేసింది.



| జాన్వీ సందడి |

తల్లి శ్రీదేవి పుట్టిన రోజున బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రతో కలిసి గురువారం తిరుమల శ్రీనివాసుడిని జాన్వీకపూర్ దర్శించుకున్నారు. పసిబిడ్డగా తాను తల్లిదండ్రులతో కలిసి తిరుమలలో తీసుకున్న ఫొటోను ఇన్‌స్టా ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకున్నారు.

పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం

● 391మందికి ప్రశంసాపత్రాలు




సిద్ధమవుతున్న వేదిక



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 14: తిరుపతిలోని ఎస్వీయూ స్టేడియంలో శుక్రవారం జరిగే 79వ జిల్లాస్థాయి స్వాతంత్ర్య దిన వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం నుంచి జిల్లా అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేపట్టి సాయంత్రానికి పూర్తి చేశారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు ఈ వేడుకలను వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి 11 శకటాలను.. 10 స్టాళ్లను సిద్ధం చేశారు. ఈ వేడుకలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు తెలిపారు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి పోలీసు పరేడ్ మైదానం బురదమయం కావడంతో ఈ వేడుకలకు వేదికను ఎస్వీయూ స్టేడియానికి మార్చిన విషయం తెలిసిందే. గురువారం వర్షం నిలవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కార్యక్రమాలిలా: శుక్రవారం ఉదయం 9గంటలకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.15గంటలకు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు సన్మానం. ఆ తర్వాత జిల్లా ప్రగతిపై సందేశం ఇస్తారు. 9.35గంటలకు వివిధ శాఖల ప్రగతి శకటాల ప్రదర్శన, 10గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 391మంది అధికారులు, ఉద్యోగులకు మంత్రి ప్రశంసాపత్రాలు అందజేస్తారు. అనంతరం స్టాళ్లను సందర్శిస్తారు.

జస్ట్.. రిహార్సల్స్



ఎస్వీయూ స్టేడియంలో పోలీసు పరేడ్ జరిగింది. ఎస్పీ హర్షవర్ధనరాజు జాతీయ జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. ఓపెన్ టాప్ జీపులో వెళుతూ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఇదంతా శుక్రవారం స్వాతంత్ర్య దిన వేడుకలకు సంబంధించి గురువారం జరిగిన రిహార్సల్స్ మాత్రమే. ఈ సందర్భంగా వేడుకలకు సంబంధించి భద్రతపై ఎస్పీ సమీక్షించారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ చూడాలని సూచించారు. మరోవైపు రెండు గంటల పాటు బాంబు, డాగ్ స్క్వాడ్లతో ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రిజర్వు అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, రిజర్వు సీఐలు పాల్గొన్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో 39 మందికి పురస్కారాలు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని తొమ్మిది సర్కిళ్లలో కడపకు ఉత్తమ అవార్డు వచ్చింది. సదరన్ డిస్కం కంపెనీలో తొమ్మిది విభాగాల్లో పలు డివిజన్లు, సెక్షన్లకు ఉత్తమ అవార్డులు వచ్చాయి. కార్పొరేట్ కార్యాలయంలో 39 మందికి ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ కె.సంతోషరావు.. ఆయా సర్కిళ్ల పరిధిలో ఎంపికైన వారికి ఎస్ఈలు ఉత్తమ సేవా పురస్కారాలను అందిస్తారు.

నేడు పోలీస్ సేవా పతకాలు ప్రదానం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు, ఇంటెలిజెన్సు, అగ్నిమాపక, ఎర్రచందనం టాస్క్‌ఫోర్సులోని పలువురు అధికారులు, సిబ్బందికి ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మార్చి నెలలో వివిధ సేవా పతకాలు ప్రకటించింది. స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఈ పతకాలను అందజేయనున్నారు. వీరిలో ఉత్తమ సేవా పతకం కింద అలిపిరి ఏఎస్ఐ జి.భాస్కర్.. సేవా పతకాల్లో జిల్లా పోలీసు కార్యాలయంలో అడ్మిన్ ఏఎస్పీ వెంకట్రావు, సైబర్ క్రైం సీఐ వినోద్ కుమార్, వెస్ట్ పీఎస్‌లో ఏఎస్ఐ ఎల్.మునిరత్నం నాయుడు, తడ ఏఎస్ఐ శ్రీకుమార్ రెడ్డి, పిచ్చాటూరు ఏఎస్ఐ భక్తవత్సలరాజు, భాకరాపేట హెడ్ కానిస్టేబుల్ వెంకటసిద్దారెడ్డి, తిరుపతి రిజర్వు హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు, ఎస్వీయూ పీఎస్ కానిస్టేబుల్ వెంకటరమణయ్య, రిజర్వు హెడ్ కానిస్టేబుళ్లు బ్రహ్మానాయక్, రమేష్‌బాబు, తిరుపతి వెస్ట్ నిర్మల, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునరావు, రిజర్వు హెడ్ కానిస్టేబుల్ ప్రసన్న ఆంజనేయులు తదితరులున్నారు.

నేటి నుంచే 'స్త్రీ శక్తి'

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్కటైన 'స్త్రీ శక్తి' పథకం శుక్రవారం సాయంత్రం అమలు కానుంది. ఆయా నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల చేతుల మీదుగా మహిళల ఉచిత ప్రయాణం ప్రారంభించనున్నారు. తిరుపతి సీబీఎస్‌లో, చంద్రగిరికి సంబంధించి మంగళంలో, శ్రీకాళహస్తి, పుత్తూరు, పిచ్చాటూరు, వెంకటగిరి, గూడూరు, వాకాడు, సూళ్లూరుపేట బస్సుస్టేషన్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు లేదా రెండు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లను వరుసక్రమంలో ఉంచి పూజలు నిర్వహించి మహిళలను వరుసక్రమంలో ఎక్కిస్తారు. ఆ తర్వాత జెండా ఊపి బస్సును ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 4- 5గంటల మధ్య జరగనుంది. ఇప్పటికే జీరో టిక్కెట్ జారీపై కండక్టర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సాయంత్రం 5గంటల నుంచి ఈ-పాస్ యంత్రాలకు అనుమతి రానుంది. ఫొటోతో ఉన్న ఒరిజిల్ గుర్తింపు కార్డు నేరుగా గాని ఫోన్ ద్వారా గాని చూపించవచ్చు. గుర్తింపుకార్డులో చిన్న లోపం ఉన్నా ఉచితం వర్తించదు. మహిళలు తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని ఆర్టీసీ అధికారులు కోరారు. మహిళల ఉచిత ప్రయాణం నేపథ్యంలో ప్రజారవాణాధికారి జగదీష్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాధం, సీఎంఈ బాలాజీ, అన్ని డిపోల మేనేజర్లు ముందస్తు చర్యలు చేపట్టారు.

యాంత్రీకరణ సాగుపై రైతులకు ప్రోత్సాహం

● జోనల్ ప్రత్యేకాధికారి ఎం.టి.కృష్ణబాబు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించాలని జోనల్ ప్రత్యేకాధికారి, రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు సూచించారు. గురువారం జిల్లా సమగ్రాభివృద్ధికి సంబంధించి కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. యాంత్రీకరణ ద్వారా రైతులు తక్కువ సమయంలో ఎక్కువ భూమిని సాగు చేయగలరని కృష్ణబాబు చెప్పారు. తద్వారా దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. ఆ దిశగా రైతులను ప్రోత్సహించేలా అధికారులు కృషి చేయలన్నారు. అధునాతన పద్ధతులను అనుసరించేలా సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీ కింద నీటి గుంతలు, డ్రోన్ వినియోగం మీద ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, పీ4 వంటి ప్రాథమిక ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరుపై అధికారులు పురోగతి సాధించాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూజిల్లాలో 80 శాతం సబ్సిడీతో డ్రోన్లు అందించామన్నారు. రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమీక్షలో జేసీ శుభం బన్సల్, నగర పాలక కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, అడిషనల్ ఎస్పీ రవి మనోహచారి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు, పక్కన కలెక్టర్ వెంకటేశ్వర్

ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రారంభం





ఎస్వీ వైద్య కళాశాలలో మొదటి అడ్మిషన్ పత్రాన్ని గుణభూషణ్‌కు అందజేస్తున్న ప్రిన్సిపల్ రవిప్రభు - స్విమ్స్‌లో మొదటి అడ్మిషన్ పత్రాన్ని సాయిశ్రీనిత్యకు అందజేస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో నీట్ ర్యాంకర్ల అడ్మిషన్లు మొదలయ్యాయి. కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు గురువారం ఈ ప్రక్రియను ప్రారంభించారు. నీట్‌లో 4990 ర్యాంకు సాధించిన గాలి గుణభూషణ్(తిరుపతికి) కి మొదటి అడ్మిషన్ పత్రాలన్ని అందించి అభినందించారు. వైద్యవిద్యలో అడుగు పెట్టడం అదృష్టంగా భావించి బాగా చదివి పేదలకు చక్కటి వైద్యసేవలను అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ వెంకటేశ్వర్లు, డీఎస్ఎన్ మూర్తి, అరుణ్ బాబు పాల్గొన్నారు. స్విమ్స్ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. నీట్‌లో ఆల్ ఇండియాలో 14,255 ర్యాంకు సాధించిన సాయి శ్రీనిత్య(కర్నూలు)కు ఆయన మొదటి అడ్మిషన్ పత్రాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలోని 26 సీట్లకు గాను మొదటి రోజు ఒక విద్యార్థికి అడ్మిషను అందించామన్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ ముతీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



భక్తుల భద్రతే లక్ష్యంగా పటిష్ఠ ఏర్పాట్లు

● ఈవో శ్యామలరావు ఆదేశం

తిరుమల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు2వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు సంతృప్తికరంగా స్వామిని దర్శించుకునేలా, లక్ష్యంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. తిరుపతిలోని ఏడీ బిల్డింగ్‌లో గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ.. గత బ్రహ్మోత్సవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి విజిలెన్స్, పోలీసు సిబ్బంది సమన్వయంతో పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనసేవలను ఇబ్బందులు లేకుండా వీక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలిపిరి చెక్‌పాయింట్‌లో అదనంగా 12 స్కానర్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. గరుడసేవ రద్దీని దృష్టిలో పెట్టుకుని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తిరుమల, తిరుపతిలో పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించాలన్నారు. అన్ని ప్రాంతాల్లో సైన్‌బోర్డులు, సూచిక బోర్డులుఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపుఈవో వెంకయ్యచౌదరి(వర్చువల్‌గా), సీవీఎస్వో మురళీకృష్ణ, ఎఫ్ఎఅండ్ సీఏవో బాలాజీ, వీజీవో రాంకుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పవన్‌పై దాడి కేసులో 8 మంది అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పవన్‌కుమార్‌పై దాడి చేసిన కేసులో ఎనిమిది మంది నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండుకు పంపారు. దీంతో మొత్తం అరెస్టయిన వారి సంఖ్య పదికి చేరింది. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం తెలిపిన ప్రకారం.. పవన్‌ను విచక్షణారహితంగా కొడుతున్న దినేష్ వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇతడే ఏ1. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం అట్లవారిపల్లెకు చెందిన దినేష్ తిరుపతిలోనే ఉంటున్నాడు. అరెస్టయిన వారిలో ఇంకా గంగాధరనెల్లూరు మండలం వేల్కూరుకు చెందిన రేవంత్‌రాజు, ఓజిలికి చెందిన అజయ్‌కుమార్, తిరుపతిలోని మంచినీళ్లగుంటకు చెందిన మలిశెట్టి హరికృష్ణ, పులిచెర్ల మండలం బండారువారిపల్లెకు చెందిన ప్రవీణ్‌కుమార్, చౌడేపల్లె మండలం పరికిదొనకు చెందిన కిశోర్‌బాబు, సదుం మండలం పాలమందకు చెందిన మధు, సత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం కడపలవారిపల్లెకు చెందిన సాయికిరణ్ ఉన్నారు. ప్రస్తుతం వీరిలో సాయికిరణ్ బెంగళూరులో ఉండగా, మిగిలిన వారంతా తిరుపతిలో నివాసం ఉంటున్నారు. ఈ ఎనిమిది మంది తిరుపతి రూరల్ మండలం రామచంద్రాపురం జంక్షన్ సమీపాన అవిలాల మైదానం దక్షిణ గేటు వద్ద ఉండగా అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. మిగిలిన నిందితులనూ త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. కాగా, ఈ కేసులో ఏ2, ఏ3 నిందితులైన అనిల్‌కుమార్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డిని ఇంతకు ముందే అరెస్టు చేసిన విషయం తెలిసిందే.



శ్రీవారి సేవలో జాన్వీ కపూర్

బాలీవుడ్ నటీనటులు జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్ర గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి కాలిబాటలో బుధవారం రాత్రి తిరుమల చేరుకున్న వీరు గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఆలయం వెలుపల జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు.

హ్యాపీ బర్త్‌డే అమ్మ



తల్లిదండ్రులతో చిన్నారి జాన్వీ కపూర్

'హ్యాపీ బర్త్‌డే అమ్మ.ప్రతి అడుగులో నీ పేరు నా గుండెల్లో ఉంటుంది' అంటూ జాన్వీ కపూర్ గురువారం ఉదయం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఆగస్టు 13న శ్రీదేవి పుట్టిన రోజు. దీనిని పురస్కరించుకుని తన చిన్ననాట తిరుమలలో తలనీలాలు సమర్పించి తల్లిదండ్రులు శ్రీదేవి, బోనీ కపూర్‌తో కలిసి ఉన్న ఫొటోను పోస్ట్ చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సోలార్ ఫెన్సింగ్‌పై పడి రైతు మృతి



షణ్ముగం (ఫైల్)

సత్యవేడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం మదనంబేడులోని పొలాల వద్ద బుధవారం రాత్రి సోలార్ ఫెన్సింగ్‌పై పడి రైతు మృతిచెందారు. గ్రామస్తుల కథనం మేరకు.. పంటకు నీళ్లు పెట్టడానికని నాదముని కుమారుడు శ్రీరామ్‌షణ్ముగం పొలానికి వెళ్లారు. సోలార్ విద్యుత్ స్విచ్ ఆన్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా అదుపుతప్పి పొలానికి ఏర్పాటు చేసిన సోలార్ కంచెపై పడ్డారు. ఆ సమయంలో అక్కడ ఎవరూలేక పోవడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఎంత సేపటికీ షణ్ముగం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వచ్చి చూడగా మృతి చెంది ఉన్నారు. మృతదేహాన్ని ఇంటికి తరలించారు. కాగా షణ్ముగంకు భార్య, కుమారుడు ఉన్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం గ్రామానికి చేరుకుని షణ్ముగం భౌతికకాయానికి నివాళులు అర్పించి, మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. షణ్ముగం కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.31 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,859

తలనీలాలు సమర్పించినవారు: 33,344



స్వరాజ్య ఫలాలు ఇవేనా?

వానొస్తే.. ఇంతే!

ఈ చిత్రం చూస్తే చాలు.. చస్తే ఆ ఊరి ప్రజలకు ఎంత చావొస్తుందో చెప్పడానికి. ఇది నాగలాపురం మండలం సురుటిపల్లి పంచాయతీ కస్తూరినాయుడు కండ్రిగలో దశాబ్దాలుగా ఉన్న పరిస్థితి. పల్లెకు దక్షిణంగా అరుణానది ఒడ్డున స్మశానం వుంది. దీన్ని చేరుకోవాలంటే ఈ వాగును దాటాలి. వానకురిస్తే ఇది ఉధృతంగా ప్రవహిస్తుంది. వానాకాలంలో గ్రామంలో ఎవరైనా చనిపోతే ఓ భుజంపై పాడె మోస్తూ మరో భుజంతో ఈదుకుంటూ ఆ కాలువ దాటి స్మశానానికి వెళ్ళాలి. ప్రవాహ వేగం ఎక్కువగా వుంటే ఇరిగేషన్ అధికారులను బతిమలాడి సురుటిపల్లి వద్ద లాకులు మూసివేయిస్తారు. దాంతో కాలువలో ప్రవాహ వేగం తగ్గి మృతదేహాలను కాలువ దాటించి స్మశానానికి చేర్చడానికి వీలవుతుంది. ఇది దశాబ్దాలుగా ఉన్న సమస్య. పాతిక మీటర్లు కూడా లేని ఈ కాలువ దాటడానికి చిన్న పాటి వంతెన లేదా కాజ్ వే నిర్మిస్తే సమస్య తీరుతుంది. పెద్దగా నిధులేమీ ఖర్చు కావు. అయినా సమస్య తీరడమే లేదు.



కస్తూరినాయుడు కండ్రిగలో శవంతో కాలువ దాటుతున్న గ్రామస్తులు. (ఫైల్ ఫొటో)

నాగలాపురం మండలం సురుటిపల్లి పంచాయతీలోనే లింగమనాయుడు కండ్రిగదీ ఇదే సమస్య. అర కిలోమీటరు దూరం ఇలా పొలం గట్ల మీదుగానే శవాన్ని మోసుకుని వెళ్ళాలి. పొలాలు తొక్కేస్తున్నారంటూ అడపాదడపా రైతుల అభ్యంతరాలతో గొడవలూ జరుగుతునే వున్నాయి. ఎన్ని అర్జీలైనా ఈ సమస్యకు పరిష్కారం చూపడంలేదు.



(ఫైల్ ఫొటో)

పక్షులేనా.. మనుషుల్ని పట్టించుకోరా?

పులికాట్ సరస్సును చీలుస్తూ సూళ్ళూరుపేట నుంచి శ్రీహరికోటకు తళతళ మెరిసే తారు రోడ్డు ఉంది. ఈ రోడ్డులోని అటకానితిప్ప నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉండే వేనాడుకు ప్రయాణం అంటే ప్రాణాంతకమే. పర్యావరణ చట్టాలు అనుమతించవు అంటూ 50 ఏళ్లకు పైగా సాకులు చెబుతూనే ఉన్నారు. ముస్లింలే లేని వేనాడులో ముస్లిం మత గురువు దావూద్ షావీ సమాధి అల్లా తాత దర్గాగా ప్రసిద్ధి చెందింది. దీనిని సందర్శించేందుకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. అయినా పక్షులకు కష్టం అని ప్రజల్ని కష్టపెడుతూనే ఉన్నారు. వేనాడు పరిధిలోని మూల, అలాపత్రి, మట్టిగుంట, పల్లిపేట కుప్పం, మొక్కపల్లి సెంటర్ లలోని ప్రజల పరిస్థితి కూడా ఈ 78 ఏళ్లలో ఏమీ మారలేదు. షార్‌కి వర్తించని ఆంక్షలు మా పల్లెలకు మాత్రమే వర్తిస్తాయా అని నిప్పులు చిమ్ముకుంటూ ఎగిరే రాకెట్లను చూస్తూ ఇక్కడి ప్రజలు నిట్టూర్పులు వదులుతుంటారు.









చిట్టమూరు మండలం గొల్లలనట్టు నుంచీ బురదగాలి కొత్తపాలెం వెళ్ళే మట్టి రోడ్డు దుస్థితి.

వాకాడు మండలం మొనపాలెం నుంచీ తీర గ్రామాలకు 13 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు దుస్థితి.

తెల్లదొరల చేతుల్లోంచి నల్లదొరల చేతుల్లోకి పాలన మారడాన్ని స్వతంత్రం అందామా..? అయితే మనకు 78 ఏళ్ల కిందటే స్వతంత్రం వచ్చింది! పరాయి సంకెళ్లను తెంచేందుకు పోరాడిన యోధులు ఆశించిన భారతం ఇదేనా? కాదు..కాదు..ఎన్నటికీ కానేకాదు!

క్యాలెండర్‌లో కాయితాలు చిరిగిపోతున్నాయి తప్ప, ప్రజల కడగండ్లు తీరుతున్నాయా? అధికారం చేతులు మారింది తప్ప, జీవనప్రమాణాలు పెరిగాయా? సొంత పాలనలోకి మారి ఏడు దశాబ్దాలు దాటి ఎనిమిదో దశాబ్దంలోకి అడుగుపెడుతున్నా పల్లెలు ఈసురోమంటూనే ఉన్నాయి. సేద్యం ఒక జూదంగా మారిపోయింది. స్వేదజలాలతో పంటలు పండించినా ఫలితం వెక్కిరిస్తుంది. ఉరితాళ్లలో, ఎండ్రిన్ డబ్బాల్లో పరిష్కారాన్ని అన్నదాతలు వెతుక్కుంటూనే ఉన్నారు. గుంతలు, గతుకుల మయమైన రోడ్లు.. రోడ్లున్నా బస్సులు రాని ఊళ్లు.. మరణిస్తే జానెడు జాగా దొరకడం గగనంగా మారిన పల్లెలు.. స్వతంత్ర భారత వజ్రోత్సవాలకు దిష్టిచుక్కల సాక్ష్యంలా తిరుపతి జిల్లాలో ఇలా మిగిలే ఉన్నాయి. సంబరాలు చేసుకునే వేళ అయినా.. సంకల్పం చెప్పుకోవాలనే ఆశతోనే ఈ కథనం...

ఆంధ్రజ్యోతి - తిరుపతి జిల్లా నెట్‌వర్క్

● దశాబ్దాలుగా కన్నీరు పెడుతూనే ఉన్న పల్లెలు



వేనాడు వెళ్ళే మట్టి రోడ్డు దుస్థితి



వేనాడుకు తారు రోడ్డు నిర్మాణానికి నిబంధనలు అడ్డు కారాదని 1992లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేసిన రంగాచారి కమిషన్ సిఫారసు చేసింది. ఇందు కోసం 2002లో రూ. 4 కోట్లు, 2006లో రూ. 6 కోట్లు, రూ. 2017లో రూ. 3.50 కోట్లు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. అయితే అటవీ శాఖ అనుమతులు మాత్రం రాలేదు. దీంతో ఈ నిధులన్నీ మురిగిపోయాయి.

- సుదర్శన్ మొదలియార్, న్యాయవాది, వేనాడు

అటవీ ఆంక్షల పుణ్యం ఈ రోడ్లు

చిట్టమూరు, చిల్లకూరు, వాకాడు మండలాల్లోని పలు సముద్రతీర గ్రామాలు అటవీ శాఖ ఆంక్షల చట్రంలో ఇరుక్కుపోయి మగ్గిపోతున్నాయి. కనీసం తారు రోడ్డుకు కూడా ఈ గ్రామాలు నోచుకోవడం లేదు. చిట్టమూరు మండల కేంద్రం నుంచీ బురదగాలి కొత్తపాలెం 13 కిలోమీటర్ల దూరంలో వుండగా బురదగాలి 14 కిలోమీటర్ల దూరంలో, కుమ్మరపాలెం 20 కిలోమీటర్ల దూరంలో వున్నాయి. ఈ గ్రామాలకు వెళ్ళాలంటే ఇప్పటికీ మట్టి రోడ్లే దిక్కు. తారు రోడ్లు వేయడానికి అటవీ శాఖ అనుమతించదు. సాధారణ రోజుల్లో దుమ్ము కొట్టుకుంటూ ప్రయాణించే గ్రామస్తులు వర్షాకాలంలో బురద, గోతులతో నిండిన రోడ్లపై పడుతూ లేస్తూ ప్రయాణాలు సాగిస్తున్నారు. వాకాడు మండలంలో మొనపాలెం, మాధవరం, పూడికుప్పం, చిన్నతోట, పూడిరాయిదొరువు, నవాబ్‌పేట, నెల్లిపూడిలకు కూడా అటవీ శాఖ ఆంక్షల కారణంగానే తారురోడ్లు లేవు. చిల్లకూరు మండలం పున్నపువారిపాలెం గ్రామానికి సైతం తారు రోడ్డు లేదు.



కాలం మారుతున్నా మేము మాత్రం జంతువుల్లాగా బతుకుతున్నాం. తారు రోడ్లు లేవు, సెల్ ఫోన్ టవర్లు లేవు. కనీసం నాణ్యమైన కరెంటు కూడా లేదు. ఎన్నేళ్లు గడుస్తున్నా మా బతుకులు ఇంతేనా?

- యర్రబోతు రాజగోపాల్‌రెడ్డి, పూడిరాయదొరువు



శ్రీహరికోటలో రాకెట్ కేంద్రం పెట్టాలని మమ్మల్ని ఖాళీ చేయమన్నారు. 1972లో పుట్టిన గడ్డ వదిలి వాకాడు మండలానికి వచ్చేశాం. శ్రీహరికోట నుంచి రాకెట్లు ఎగురుతున్నాయి కానీ, మా బతుకులు మాత్రం ఎదగడం లేదు. అదేమంటే వన్యప్రాణి చట్టం.. ఏమీ చేయలేం అంటారు. మా త్యాగానికి తగిన ఫలమే దక్కింది!

- మామిడి గోవిందయ్య, చిన్నతోట

వాటంబేడుకి బస్సు రాదు

తడ మండలం వాటంబేడు గ్రామం సూళ్ళూరుపేట పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో వుంది. ఆ మార్గంలో గొల్లల మలుపు, పల్లిపలెం, గోపాల్‌రెడ్డిపాలెం, పాముల మిట్ట, వాటంబేడు, వాటంబేడు కుప్పం తదితర ఆరు గ్రామాలు వున్నాయి. ఈ మార్గంలో తారు రోడ్డు కూడా వుంది. అయితే ఆర్టీసీ బస్సు మాత్రం నడవదు. కరోనా కాలంలో ఆగిపోయిన బస్సును మళ్లీ వేయనేలేదు.





సూళ్ళూరుపేట నుంచీ వాటంబేడు నడుమ ఉన్న నున్నటి తారు రోడ్డు - వాటంబేడు గ్రామ కూడలి



ఇంతకు ముందు ఈ రూట్‌లోని గ్రామాల నుంచి స్కూళ్ళకు, కాలేజీలకు ఆర్టీసీ బస్సులోనే పోయి వచ్చేవాళ్ళు ఇపుడు ఆటోలే దిక్కు.

- గద్దగుంట ప్రవీణ్, విద్యార్థి, వాటంబేడు



బస్సులో పది రూపాయల ఛార్జీతో సూళ్ళూరుపేటకి చేరేవాళ్ళం. ఇపుడు ఆటోకు రూ. 30 ఇస్తున్నాం. అయినా ఆటోలో భద్రత వుండదు.

- బోడి మాణిక్యం శెట్టి, వాటంబేడు కుప్పం

మూడు మార్కెట్ కమిటీలకు పాలకవర్గాల నియామకం

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం పాలక వర్గాలను ఏర్పాటు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వెంకటగిరికి పునుగోటి విశ్వనాథ్, గూడూరుకు చిల్లకూరు నీరజ, వాకాడుకు మర్రి ప్రమీల అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ పాలకవర్గాలు ఏడాది పాటు కొనసాగనున్నాయి.

వెంకటగిరి, ఆంధ్రజ్యోతి: వెంకటగిరి మార్కెట్ కమిటీకి గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఛైర్మన్‌గా పునుగోటి విశ్వనాథ్, వైస్ ఛైర్మన్‌గా కుని సూరి, సభ్యులుగా తాళ్ళూరు ప్రసాద్, రాపూరు శ్రీనివాసులు, వెలుగులేటి వెంకటేశ్వర్లు, సగ్గం మల్లీశ్వరి, చింతమాను వెంకటపతి, అరికట్ల శ్రీరాములునాయుడు, దండోలు పెంచలరెడ్డి, రంగినేని కోటేశ్వరరావు, నీలకంఠం మురళి, చిట్టిపు వెంకటాచలపతి, ఎన్.సుబ్రమణ్యం, ఎ.సుబ్బరామయ్య, కె.రవిశంకర్, వెంకటగిరి సింగిల్‌విండో ఛైర్మన్, వెంకటగిరి వ్యవసాయ శాఖ ఏడీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి నియమితులయ్యారు.

గూడూరు, ఆంధ్రజ్యోతి: గూడూరు మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, ఛైర్‌పర్సన్‌గా చిల్లకూరు నీరజ, వైస్ ఛైర్మన్‌గా సోమిశెట్టి చెందురామయ్య, సభ్యులుగా నెలటూరు సుప్రజ, మేకల కిషోర్, మనుబోలు కృష్ణయ్య, ఎస్‌కే మహమ్మద్ జాకీర్, మలల్లి శ్యామల, ఎస్‌కే పర్వీన్, పెజ్జాయి ప్రవీణ్ కుమార్ రెడ్డి, గాలి ప్రకాష్ నాయుడు, కీర్తిపాటి సుధ, కొడూరు కృష్ణమ్మ, పంట నిర్మలమ్మ, వేముల సునీల్, అరికట్ల మల్లికార్జునరావు, చిల్లకూరు సింగిల్ విండో ప్రెసిడెంట్, గూడూరు వ్యవసాయ శాఖ ఏడీ, కాంద్ర పంచాయతీ సర్పంచ్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారులను ప్రభుత్వం నియమించింది.

వాకాడు, ఆంధ్రజ్యోతి: వాకాడు మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, ఛైర్‌పర్సన్‌గా మర్రి ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సభ్యులుగా సిద్ధపురెడ్డి పోలమ్మ, పంత్రంగం వసంత్, బత్తిన ప్రమీల, చల్లా స్వాతి, మారంరెడ్డి జనార్దనరెడ్డి, వాకా సిరిజ, బసవనూరు భాస్కర్, ఎ.యామిని, విన్నమాల మంజుల, కల్లూరు క్రాంతి, ఎస్‌కే మస్తాన్ బాషా, దొడ్డగ వెంకట్రమణ, ఎల్లపోతు రాజగోపాల్‌రెడ్డి, కోట మండలం తిన్నెలపూడి సింగిల్ విండో ఛైర్మన్, నాయుడుపేట వ్యవసాయ శాఖ ఏడీ, వెంకన్నపాలెం పంచాయతీ సర్పంచ్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి నియమితులయ్యారు.

'ఇరకం కుప్పం' గ్రామస్తులకు ఇళ్ల పట్టాల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తడ మండలం పులికాట్ సరస్సు మధ్యలోని ఇరకం కుప్పం గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ మేరకు తడలో గురువారం కార్యక్రమం నిర్వహించారు. మౌలిక సదుపాయాలు లేకుండా ఏళ్లతరబడి ఇక్కడి నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా పూడికుప్పం గ్రామానికి వలస వచ్చేందుకు నిర్ణయించుకున్నారు. ఆ గ్రామంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పలుమార్లు అప్పటి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. గతేడాది ఎన్నికల సందర్భంగా తాము ఇళ్ల స్థలాలు కేటాయిస్తామంటూ టీడీపీ నేతలు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వైసీపీ నేత, పూడి సర్పంచి పరమశివరెడ్డి ఇళ్ల స్థలాల కేటాయింపు అడ్డుకుంటూ కోర్టులో కేసు వేశారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చొరవ చూపి న్యాయస్థానంలో ఆ కేసు వీగిపోయేలా చేసి ఇళ్ల స్థలాల మంజూరుకు మార్గం సుగమం చేశారు. ఈ క్రమంలో గురువారం ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా ఒక్కొక్కరికి 2.5 సెంట్లు చొప్పున 172 మందికి పూడికుప్పం గ్రామంలో ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ద్వారా రూ.2.90 లక్షలు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే, కలెక్టర్ చెప్పారు. తాగునీటి సౌకర్యార్థం రెండు బోర్లు వేయిస్తామన్నారు. లక్కీడిప్ ద్వారా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, ఆర్డీవో కిరణ్మయి, డీఎల్‌డీవో జాలిరెడ్డి, తహసీల్దార్ శరత్‌బాబు, టీడీపీ నాయకులు కామిరెడ్డి మురళి రెడ్డి, బొమ్మన్ శ్రీధర్, ఆకుతోట రమేష్, తిరుమూరు సుధాకర్ రెడ్డి, సంచి కృష్ణయ్య, నీల కంఠం, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తార్కిక ఆలోచనలే విజయానికి సోపానాలు

● యండమూరి వీరేంద్రనాథ్



మాట్లాడుతున్న యండమూరి వీరేంద్రనాథ్

తిరుపతి రూరల్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తార్కిక ఆలోచనల ద్వారా పోటీపరీక్షల్లో విజయాన్ని సాధించవచ్చని నవలా రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ పేర్కొన్నారు. ఎంఆర్‌పల్లెసర్కిల్‌లోని కౌటిల్యా ఇన్‌స్టిట్యూట్‌లో స్టెప్ ఫర్ సక్సెస్ అనే అంశంపై విద్యార్థులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. వివిధ పోటీల్లో విజయానికి వ్యూహాలు, నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తికి మెళకువలు, మొబైల్‌ఫోన్ నుంచి విముక్తి, ఒత్తిడి నిర్వహణ వంటి విషయాలపై పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ..ఆరోగ్యం, కీర్తి, సంపద, ప్రేమ, ఉత్సాహం విజయానికి నిర్వచమన్నారు. మానసిక ఆరోగ్యమున్న వ్యక్తి భయం, దుఃఖం, కోపం అనే మూడు రకాల వ్యాధుల నుంచి బయటపడుతాడాన్నరు. వైఫల్యాలని విజయాలకు దారితీసే మెట్లుగా మార్చుకోవడమన్నది పాత పంథాఅన్నారు. వైఫల్యమే లేనంతగా కృషి చేయడమనది నేటి పోటీ ప్రపంచంలో కొత్త ఒరవడి అన్నారు. స్మార్ట్ ఫోన్లతో విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. అనవసర స్నేహాల వల్ల ఉన్నతికి అడ్డుకట్టపడుతుందన్నారు. లీడర్‌షిప్, కామన్‌సెన్స్, కమ్యూనికేషన్, తెలివి లక్షణాలను కలిగి ఉంటే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని విద్యార్థుల్లో చైతన్యం నింపారు. సంస్థ డైరెక్టర్ శ్రీధర్ తదితరులు మాట్లాడారు.

ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి



గూడూరు తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, విద్యార్థులు, సూళ్లూరుపేటలో తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే ఆర్డీవో కిరణ్మయి, టీడీపీ నాయకులు

గూడూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేకానంద కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ నుంచి పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రతి ఒక్కరూ వారి ఇంటిపైన జాతీయజెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురాజు, వెంకటేశ్వరరావు, మల్లికార్జున, అబ్దుల్‌రహీం, చంద్రమౌళి, బిల్లు చెంచురామయ్య, అమరేంద్ర, సీఐ శేఖర్‌బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో...

సూళ్లూరుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం సూళ్లూరుపేటలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీని స్థానిక హోలీక్రాస్ సర్కిల్ వద్ద ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. హోలీక్రాస్ కూడలి నుంచి షార్ వై జంక్షన్ వరకు సాగిన తిరంగా ర్యాలీలో పొడవైన జాతీయ జెండాను పట్టుకుని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, చిట్టేటి పెరుమాల్, బీజేపీ నాయకులు తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, అత్తిరాల కిరణ్ కుమార్ గౌడ్, బెజవాడ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

● అదే విధంగా వీఎస్ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల నుంచి షార్ బస్టాండు వరకు జాతీయ జెండాతో విద్యార్థులు తిరంగా ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శంకర్ శర్మ, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ సుబ్రమణ్యం, అధ్యాపకులు శ్రీనివాసులు, ఏడుకొండలు, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు మెరుగైన సౌకర్యాలు: ఎమ్మెల్యే కురుగొండ్ల


సీతారామ ఆలయానికి భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

డక్కిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఉచిత బస్సు ప్రయాణంలో మహిళలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. డక్కిలి మండలం పాతనాలపాడు గిరిజన కాలనీలో రామాలయ నిర్మాణానికి గురువారం జరిగిన భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన డి.వడ్డిపల్లి గ్రామానికి వెళ్లి సర్పంచ్ వేపమాను చెంచమ్మ సంతాప సభలో పాల్గొని పుష్పగుచ్ఛాలతో ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకటగిరి ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు కేవీకే ప్రసాద్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, చంద్రమౌళిరెడ్డి, రంగినేని రాజా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం: డీఎస్పీ

నాయుడుపేట టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో చట్టాలను పాటించడం ద్వారా సురక్షితంగా, శాంతియుతంగా జీవించవచ్చని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. నాయుడుపేట పట్టణం ఎల్‌ఏ సాగరంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో గురువారం రాత్రి విద్యార్థినులకు నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ చట్టాలపై అవగాహన అవసరమని చెప్పారు. అర్బన్ సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మీరాజ్యం, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చర్యలు

సూళ్లూరుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ మురళీకృష్ణ హెచ్చరించారు. సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ర్యాగింగ్‌పై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముచ్చకాల సురేష్, ఏవో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

'నిష్పక్షపాలనకు నాంది పలుకుతాం'

కోట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘం ద్వారా రైతులకు అండగా నిలిచి అన్ని విధాల ఆదుకుంటామని, నిష్పక్షపాలన అందించి ఆదర్శంగా నిలుస్తామని ఊనుగుంటపాళెం సహకారం సంఘ నూతన ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని ఊనుగుంటపాళెంలో గురువారం సహకార సంఘ ఛైర్మన్‌గా జగన్మోహన్‌రెడ్డి, సభ్యులుగా పట్టపు వెంకటేశ్వర్లు, పాకనాటి జనార్థన్‌లతో సీఈవో శ్రీనివాసులురెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. రైతు రాయితీలు, సహకార సంఘ సేవలపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది.

16, 18తేదీల్లో చెన్నై-గుమ్మిడిపూండి మధ్య 17 సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చెన్నై డివిజన్ పరిధిలోని పొన్నేరి-కవరైపేట రైల్వే స్టేషన్ల మధ్య రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా ఈ నెల 16, 18 తేదీల్లో చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి మధ్య 17 సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● చెన్నై బీచ్-గుమ్మిడిపూండి ఉదయం 9.40, మధ్యాహ్నం 12.40, చెన్నై సెంట్రల్-సూళ్లూరుపేట ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05, గుమ్మిడిపూండికి ఉదయం 10.30, 11.35, ఆవడికి రాత్రి 11.40, సూళ్లూరుపేట-నెల్లూరు మధ్యాహ్నం 3.50 గంటల సబర్బన్ రైళ్ల రద్దు. ● గుమ్మిడిపూండి-చెన్నై బీచ్ ఉదయం 10.55, సెంట్రల్‌కు మధ్యాహ్నం 12, 2.30, 3.15, సూళ్లూరుపేట-సెంట్రల్ మధ్యాహ్నం 1.15, రాత్రి 9, నెల్లూరు-సూళ్లూరుపేట సాయంత్రం 6.45 గంటల సబర్బన్ రైళ్ల రద్దు. ● చెంగల్పట్టు-గుమ్మిడిపూండి ఉదయం 9.55 గంటలకు వెళ్లే సబర్బన్ రైలు చెన్నై బీచ్ వరకు మాత్రమే నడుస్తుంది. గుమ్మిడిపూండి-తాంబరం మధ్యాహ్నం 3 గంటల రైలు చెన్నై బీచ్ నుంచి బయల్దేరుతుంది.

ప్రత్యేక రైళ్లు...

చెన్నై సెంట్రల్-పొన్నేరి ఉదయం 10.30, మీంజూరు ఉదయం 11.35, చెన్నై బీచ్-పొన్నేరి మధ్యాహ్నం 12.10, పొన్నేరి-చెన్నై సెంట్రల్ మధ్యాహ్నం 12.18, 3.33, మీంజూరు-చెన్నై సెంట్రల్ మధ్యాహ్నం 2.50 గంటలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నారు.

ఇరకం కష్టాలకు చెల్లు

● ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

తడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల ఇరకం దీవి కష్టాలకు ఇప్పటికి పరిష్కారం లభించింది. ఇరకం కుప్పం గ్రామస్తులకు కూటమి ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేసి, వారిని పులికాట్ తీరం నుంచి ఒడ్డుకు తీసుకొస్తుంది. దాంతో ఆ గ్రామస్తుల ఆనందానికి అవధుల్లేని పరిస్థితి. గురువారం ఇళ్ల పట్టాలను అందుకున్న గ్రామస్తులు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ హామీతో పొంగిపోతున్నారు.

ఇన్నాళ్లు ఎవరూ ఆదుకోలేదు

ఏ పనికైనా పులికాట్ సరస్సులో గంటపాటు ప్రయాణిస్తే తప్ప గమ్యం చేరుకోలేం. వరదల సమయంలో పడవ ప్రయాణం ప్రమాదమని తెలిసినా ప్రయాణం తప్పదు. ఇన్నాళ్లు ఎంత మందికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు.

- పెరియవట్టు సరస్వతి ఇరకం కుప్పం

ఐదేళ్లుగా ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూశాం

ఐదేళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నాం. గత ప్రభుత్వంలో అధికారులను, నాయకులను కలిసి తమ కష్టాలు చెప్పుకుని, మాకు ప్రత్యామ్నాయంగా పూడికుప్పడంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని వేడుకున్నాం. ఈ ప్రభుత్వం ఇళ్ల కేటాయించి ఆదుకుంది. అందుకు వారికి రుణపడి ఉంటాం. అయితే ఈమె వైసీపీకి చెందిన సర్పంచ్. వారి దంపతులిద్దరూ నేటికీ వైసీపీలో కొనసాగుతుండడం విశేషం.

- వల్లింబేడు మీన, ఇరకం సర్పంచ్

సంచార జాతుల వారికి దుకాణాల ఏర్పాటు

● అడ్డుకున్న మినీ లారీ కార్మికులు, సీఐటీయూ నేతలు

నాయుడుపేట/నాయుడుపేటటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు సమీపంలో నివసిస్తున్న సంచార జాతుల (నక్కలోళ్ళ)కు 12 దుకాణాలు నిర్మించేందుకు గురువారం మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోనే ఎన్నో ఏళ్ళుగా స్టాండు ఏర్పాటు చేసుకున్న మినీ లారీ కార్మికులతోపాటు సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఇక్కడ దుకాణాలు నిర్మిస్తే జీవనోపాధిని కోల్పోతామని బైఠాయించి నిరసన తెలిపారు. సీఐ బాజీ, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాలు మినీ లారీ వాహనదారులతో మాట్లాడి వారి వాహనాల నిలుపుదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని నచ్చచెప్పారు. అయినప్పటికీ వారు వినకపోవడంతో మినీ లారీ కార్మికులతోపాటు సీఐటీయూ నాయకులను పోలీసు స్టేషనుకు తరలించారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలియజేస్తున్న వారిని పోలీసులు స్టేషనుకు తరలించడం అన్యాయమని సీఐటీయూ నాయకులు ఖండించారు. మరలా వారితో చర్చలు జరిపి దుకాణాల నిర్మాణ పనులకు సహకరించాలని, స్టాండు కోసం ప్రత్యామ్నాయ స్థలం చూపుతామని చెప్పడంతో వారు వెనుతిరిగి వెళ్ళారు. నిరసన తెలియజేసిన వారిలో మినీ లారీ కార్మికులు సతీష్, మస్తాన్ రెడ్డి, గిరి, రమణయ్య, గంగయ్య పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టిన కారు

● కోమాలోకి వెళ్లిన ద్విచక్ర వాహనదారుడు

డక్కిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మునేంద్ర అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన సంఘటన లింగసముద్రం వద్ద గల జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకొంది. డక్కిలి ఎస్ఐ శివశంకర్ కథనం మేరకు.. మండలంలోని చాపలపల్లి గ్రామానికి చెందిన యాచమనేని మునీంద్ర లింగసముద్రం గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగే వేడుకలో పాల్గొనేందుకు మోటారు సైకిల్‌పై వెళుతుండగా, లింగసముద్రం క్రాస్ రోడ్డు వద్దకు రాగానే రాపూరు వైపు నుంచి వేగంగా వస్తున్న ఓ కారు ఢీకొంది. దీంతో మునీంద్ర తీవ్ర రక్త గాయాలతో రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడిని 108లో వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందంటూ అతడిని తిరుపతిలోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. గురువారం నాటికి కూడా మునీంద్ర పరిస్థితి విషమంగానే ఉందని అక్కడి వైద్యులు తెలిపారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ యువ నాయకుడి మృతికి సంతాపం

తడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఐటీడీపీ మండల అధ్యక్షుడు లోకేష్ మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. మండల పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు నిమ్మల లోకేష్ (30) గురువారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే టీడీపీ నాయకులతో కలిసి వెళ్లి లోకేశ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కామిరెడ్డి మురళిరెడ్డి, సుబ్రమణ్యం, పూడి శెల్వం, బొమ్మన్ శ్రీధర్ పాల్గొన్నారు. ● లోకేష్ కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం కింద టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ రూ.2 లక్షలను ఆ పార్టీ నాయకులు ఆకుతోట రమేష్, మాధవనాయుడు చేతుల మీదుగా అందజేశారు.